ఎన్డీఏ సమావేశం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు అయిన సందర్భంగా బుధవారం మంగళగిరిలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఎన్డీఏ శాసన సభాపక్ష సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి వంగలపూడి అనిత, శాసనసభ్యులు పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారా యణమూర్తి, కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు. చిత్రంలో విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ఉన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు జి.పురందేశ్వరిలు సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు.



నేటి నుంచి అన్న క్యాంటీన్లు



- తొలివిడత 18 ప్రారంభం
- మిగిలినవి రేపు, ఎల్లుండి అందుబాటులోకి...
- ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం
- ఏదైనా రూ.5...

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో పలుచోట్ల గురువారం రాత్రి అన్న క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి. మొత్తం 25 క్యాంటీన్లకు గాను ఆరిలోవ, విమ్స్ ఎదురుగా, ఎంవీపీ కాలనీ రైతుబజార్, టీబీ ఆస్పత్రి, కేజీహెచ్ ఓపీ గేటు, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్‌లోని ఫ్రూట్ మార్కెట్, చిట్టివలస, ములగాడ, శ్రీహరిపురం, నమ్మిదొడ్డి, చినగంట్యాడ, ఆటోనగర్, పెందుర్తి, మారికివలస, వేపగుంట, అనకాపల్లి రైల్వేస్టేషన్, ఎన్టీఆర్ ఆస్పత్రి ప్రాంతాల్లో గల 18 క్యాంటీన్లు గురువారం అందుబాటులోకి వస్తాయి. 20వ తేదీన గోపాలపట్నం, బాజీ జంక్షన్, తాటిచెట్లపాలెం వైఎస్సార్ కాలనీ, భీమిలి, మధురవాడ వాంబే కాలనీ, 21వ తేదీన మర్రిపాలెం, బుల్లయ్య కళాశాల సమీపాన గల ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద గల క్యాంటీన్లు ప్రారంభమవుతాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం సరఫరా, క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతను హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు అప్పగించారు. అల్పాహారం, భోజనం... ఏదైనా రూ.5కు అందిస్తారు.

విజిలెన్స్ మొద్దునిద్ర

నూనె ధరల పెంపుపై స్పందన కరవు

- పట్టించుకోని జిల్లా యంత్రాంగం
- డీ మార్ట్‌లో ఒక్కరోజులో కిలోకు రూ.11 పెంపు



బుధవారం రేటు బోర్డు తీసేసి రూ.123కి విక్రయం

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వంట నూనెల దిగుమతిపై సుంకం ఇంకా పెంచకపోయినా జిల్లాలో వ్యాపారులు రేట్లు పెంచి విక్రయిస్తున్నారు. గత ఐదు రోజులుగా ఈ దందా నడుస్తోంది. కిలోకు రూ.15 నుంచి రూ.20 పెంచి అమ్ముతున్నారు. జిల్లాల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి, పాత రేట్లకే విక్రయించేలా చూడాలని ఉన్నతాధికారులు విజయవాడ నుంచి ఆదేశించారు. ఇక్కడ చూస్తే విజిలెన్స్ అధికారులు కాలు కదపడం లేదు. వ్యాపారులతో ఎటువంటి లాలూచీలు ఉన్నాయో తెలియదు గానీ తనిఖీలు చేపట్టడం లేదు. డీ మార్ట్‌లో మంగళవారం వరకు ఫ్రీడమ్ ఆయిల్‌ని కిలో రూ.112 చొప్పున విక్రయించారు. నగరంలో అంతా రూ.125 నుంచి రూ.130కు అమ్ముతుంటే మనం ఎందుకు తక్కువకు విక్రయించాలనుకున్నారేమో బుధవారం రేటు పెంచేశారు. పాత స్టాకు అయిపోయిందని, కొత్త స్టాకు వచ్చిందని అందుకే రేటు పెంచాల్సి వచ్చిందంటూ కిలో రూ.123 చొప్పున అమ్మారు. అయితే వారు స్టాల్‌లో పాత రేటు బోర్డు తీసేసి, కొత్త బోర్డు మాత్రం పెట్టలేదు. అక్కడ ఏ వస్తువైనా రేటు బోర్డు పెట్టి విక్రయిస్తారు. బుధవారం ఫ్రీడమ్ ఆయిల్ కౌంటర్‌లో బోర్డు లేకపోవడం గమనార్హం. నగరంలోని ప్రతి దుకాణంలో వంట నూనెలు రేటు పెంచే అమ్ముతున్నారు. ధరలను అదుపు చేయాల్సిన జిల్లా జాయింట్ కలెక్టర్ కూడా ఈ విషయం పట్టించుకోకపోవడం గమనార్హం. కనీసం ప్రజా ప్రతినిధులైనా దీనిపై అధికారులను ప్రశ్నిస్తే ప్రజలకు పాత ధరకు వంటనూనెలు లభించే అవకాశం ఉంది.


భీమిలి ఆర్డీవోపై క్రమశిక్షణ చర్యలు

- ప్రభుత్వ భూమికి సంబంధించి తప్పుడు నివేదిక సమర్పించారని అభియోగం

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. విశాఖ రూరల్ మండలం మధురవాడ సర్వే నంబరు 133లో 3.47 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి తప్పుడు నివేదిక సమర్పించినట్టు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో ఆయనతోపాటు మరో ముగ్గురు ఉద్యోగులపై చర్యలకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీనికి సంబంధించి బుధవారం జారీచేసిన జీవో ఓపెన్ కాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



నగరంలో నాగార్జున



సినిమా చిత్రీకరణలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన ప్రముఖ కథానాయకుడు అక్కినేని నాగార్జున బుధవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ నివాసానికి వెళ్లారు. నాగార్జునను పలువురు ప్రముఖులు కలిశారు. ఈ సందర్భంగా బీచ్ అందాలను నాగార్జున వీక్షించారు.

పర్యాటకం అడ్డగోలు వ్యవహారం

ఆధునికీకరణ పనుల్లో అవకతవకలు

- అప్పుఘర్ వద్ద యాత్రీ నివాస్‌కు మొదట రూ.8.5 కోట్లు
- తరువాత మరో రూ.2.3 కోట్లు
- అంత మొత్తం పెడితే కొత్తదే నిర్మించుకోవచ్చుననే వాదన
- అరకులోయలోనూ పూర్తికాని పనులు
- ఇంజనీరింగ్ గిమ్మిక్కులతో నిధుల స్వాహా
- ఇప్పటివరకూ దృష్టిపెట్టని కూటమి ప్రజా ప్రతినిధులు



అప్పుఘర్ వద్ద ఆధునీకరిస్తున్న యాత్రీ నివాస్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పర్యాటక శాఖ వ్యవహారాలపై దృష్టిపెడితే అనేక అడ్డగోలు వ్యవహారాలు బయటపడుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు అంచనా విలువలు పెంచేసి తినేస్తున్నారు. రుషికొండలో నాటి సీఎం జగన్ కోసం నిర్మించిన ప్యాలెస్ పనులన్నీ గుట్టుగా జరిగాయి. వాటికి భారీగా నిధులు వెచ్చించారు. అందులో అందినకాడికి దండుకున్న ఇంజనీరింగ్ అధికారులు ఇతర ప్రాజెక్టుల్లోనూ అదే పనిచేశారు.

రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక అతిథి గృహాలను ఆధునీకరించాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయించినప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లాలో కూడా పలు పనులు ప్రతిపాదించారు. అందులో ప్రధానంగా అప్పుఘర్ దగ్గరున్న హరిత హోటల్, అరకులోయలోని వేలీ రిసార్ట్, హిల్ రిసార్ట్, అనంతగిరి మండలం టైడా జంగిల్ బెల్స్‌ను ఆధునికీకరించడానికి నిధులు విడుదల చేశారు. ఇవి గత ఏడాదిన్నరగా జరుగుతున్నాయి. విశాఖలోని అప్పుఘర్ వద్ద ఉన్న హరిత హోటల్‌లో 44 గదులు ఉన్నాయి. వాటికి ముందు రూ.8.5 కోట్లు కేటాయించారు. ఆ నిధులు సరిపోవడం లేదంటే మరో రూ.2.3 కోట్లు మంజూరుచేశారు. మొత్తం రూ.11 కోట్లు. ఈ నెలాఖరుకు పూర్తిచేస్తామని చెబుతున్నారు. అయితే ఆధునికీకరణకు అన్ని కోట్ల రూపాయలా?...అని అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణంలో కోట్ల రూపాయలు మింగేసిన పర్యాటక శాఖ ఇంజనీరింగ్ అధికారులే ఈ పనులు కూడా చేపట్టడంతో ఇక్కడ కూడా అదే పనిచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి అంత మొత్తం పెడితే...ఆ భవనం కూలగొట్టి కొత్త భవనం నిర్మించుకునే అవకాశం ఉండేది. నిధులు ఇచ్చిన అధికారులకు కూడా ఆ సంగతి తెలుసు. ఇక అటవీ శాఖాధికారులు అభ్యంతరం వ్యక్తంచేయడంతో అనంతగిరి మండలంలోని టైడా జంగిల్ బెల్స్ ఆధునికీకరణ పనులు ఆగిపోయాయి. అరకులోయలో పనులు కూడా నత్తనడకనే సాగుతున్నాయి. లంబసింగిలో కాటేజీల నిర్మాణంలో కూడా ఇలాగే అలసత్వం ప్రదర్శించారు. నీటి పారుదల శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి ఇక్కడ పర్యాటక శాఖ పనులు చేపడుతున్న ఇంజనీరింగ్ అధికారి రుషికొండలో నాడు వైసీపీ పెద్దలు చెప్పిన పనులన్నీ మూడో కంటికి తెలియకుండా చేసి పెట్టడంతో ఆయన పర్యవేక్షిస్తున్న ఈ ఆధునికీకరణ ప్రాజెక్టులపై ... మిగతా 6వ పేజీలో

రహదారి కబ్జా

పిఠాపురం కాలనీలో ప్రైవేటు స్థల యజమాని బరితెగింపు

- సుమారు 600 గజాలు
- అక్కడ గజం విలువ రూ.లక్షన్నర
- జీవీఎంసీ, వుడా అధికారులకు చుట్టుపక్కల నివాసితుల ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలని జీవీఎంసీకి వుడా లేఖ
- పట్టించుకోని గ్రేటర్ అధికారులు



రోడ్డును ఆక్రమించుకుని ప్రహరీ గోడ నిర్మించిన దృశ్యం

మద్దిలపాలెం, సెప్టెంబరు 18: **రోడ్డు పక్కన నివాసాలు కలిగిన కొంతమంది అడుగో, అరడుగో ఆక్రమించుకుంటుంటారు. అయితే పిఠాపురం కాలనీలో ఒకరు ఏకంగా 120 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు గల రహదారినే మాయం చేసేశారు. 120 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు అంటే దాదాపు 600 గజాలు. ఇక్కడ ప్రస్తుతం గజం రూ.లక్షన్నర పలుకుతుంది. అంటే రూ.9 కోట్లు అన్నమాట. అయితే రోడ్డు ఆక్రమణకు గురైనా జీవీఎంసీ అధికారులు పట్టనట్టు ఊరుకున్నారు. ఈ వ్యవహారం వెనుక కోట్లాది రూపాయలు చేతులు మారినట్టు సమాచారం.**

జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో సాయిరాం పార్లర్ వెనుక ఈ భూదందా చోటుచేసుకుంది. ఇక్కడ ఎకరాన్నరలో (ఎల్.పి నంబర్ 40/91) పూర్వం లేఅవుట్ వేశారు. అందులో ముప్పై అడుగుల రహదారి పోను 13 ప్లాట్లు ఉన్నాయి. ఈ వుడా లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో గతంలో ఒక పత్రిక కార్యాలయం ఉండేది. ఆ పక్కనే కొంత స్థలం ఉంది. ముందు వైపు మద్దిలపాలెం జాతీయ రహదారి, వెనుక ఈ వుడా లేఅవుట్ రోడ్డు ఆ స్థలానికి హద్దులుగా ఉన్నాయి. అయితే ఆ స్థలంలో కొంత ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేశారు. కొనుగోలుదారులు స్థలం చదును చేస్తూ వెనుక ఉన్న వుడా లేఅవుట్ రోడ్డును కలిపేసుకున్నారు. స్థలంతో పాటు రోడ్డును ఎత్తు చేసి ప్రహరీగోడ నిర్మించేశారు. దీంతో లేఅవుట్‌లో మిగిలిన ప్లాట్ల యజమానులు జీవీఎంసీకి ఫిర్యాదు చేశారు. అది తమ పరిధి కాదని, వుడాకు ఫిర్యాదు చేసుకోవాలని అధికారులు చెప్పారు. దాంతో వుడా అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు పరిశీలించిన వీఎంఆర్డీఏ కమిషనర్ అది లేఅవుట్ రోడ్డు స్థలమని నిర్ధారించారు. వెంటనే ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గత నెల 28వ తేదీన జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు. ఇప్పటివరకూ వీఎంఆర్డీఏ కమిషనర్ లేఖపై జీవీఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు స్థలం కొనుగోలు చేసిన వ్యక్తి పనులు చేపట్టారు. రోడ్డును కూడా స్థలంతో పాటు ఎత్తు చేయడంతో నివాసాలకు దారి లేకుండాపోయింది. అంతేకాకుండా రోడ్డున్న ప్రాంతంలో షెడ్డు నిర్మాణం చేశారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందిస్తారో లేదో వేచిచూడాలి.

దారి లేకుండా పోయింది

ఎల్‌పి నంబర్ 40/91 లేఅవుట్‌లో 30 అడుగుల రోడ్డుకు ఆనుకుని ప్లాటు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నాం. ఇప్పుడు ఇంటి ముందు రోడ్డును ఖాళీ స్థలంలో కలిపేసుకుని ప్రహరీ నిర్మాణం చేశారు. రోడ్డు ఆక్రమించడం వల్ల మాకు దారి లేకుండా పోయింది. దీనిపై జీవీఎంసీ, వుడా అధికారులకు ఫిర్యాదు చేశాం. వుడా కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ అధికారులకు లేఖరాశారు. జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు.

\- కె.సత్యనారాయణ, లేఅవుట్ నివాసి.

దుర్గ్ వందేభారత్‌కు ఆదరణ లభించేనా?

రేపటి నుంచి సర్వీస్‌లు

- మందకొడిగా సీట్ల రిజర్వేషన్
- మొత్తం 1286 సీట్లు...అయ్యింది 300లే
- చైర్‌కార్ టికెట్ ధర రూ.1,495, ఎగ్జిక్యూటివ్ రూ.2,760



విశాఖపట్నం, సెప్టెంబరు 18: విశాఖ-దుర్గ్ మధ్య ప్రవేశపెట్టిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల నుంచి ఆదరణ లభించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 20 నుంచి పట్టాలెక్కనున్న ఈ సర్వీసులకు ప్రయాణికుల నుంచి ఆశించిన స్పందన కనిపించడం లేదు. విశాఖ-దుర్గ్ మధ్య వారానికి ఆరు రోజులు (గురువారం మినహా) అందుబాటులో ఉండే ఈ సర్వీసులకు ఆక్యుపెన్సీ ఆశాజనకంగా కనిపించడం లేదు. ఈ నెల 20న దుర్గ్ నుంచి విశాఖకు, విశాఖ నుంచి దుర్గ్‌కు సర్వీస్‌లు మొదలుకానున్నాయి. అయితే సీట్లు ముందస్తు రిజర్వేషన్‌ను పరిశీలిస్తే బుధవారం రాత్రికి సుమారు 986 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 16 కోచ్‌లతో నడిచే ఈ రైలుకు సీసీ, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లలో కలిపి 1,286 సీట్లు అందుబాటులో ఉంటాయి. విశాఖ నుంచి దుర్గ్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు (20830) బుధవారం రాత్రి సమయానికి సీసీ కోచ్‌లలో 909, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 77 సీట్లు ఖాళీ చూపిస్తున్నాయి. దుర్గ్ నుంచి విశాఖ వచ్చే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు (20829) కూడా సుమారు అదే పరిస్థితి. అంటే మొత్తం సీట్ల సంఖ్యలో ఇప్పటివరకూ కేవలం 23.5 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

టికెట్ ధరలను పరిశీలిస్తే...

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చైర్‌కార్ (సీసీ) ... మిగతా 6వ పేజీలో

రైతుబజార్లు వెలవెల

సెలవు రద్దుపై రైతుల విముఖం

- ఎంవీపీ, నరసింహనగర్‌లలో ఖాళీగా దర్శనమిచ్చిన స్టాళ్లు



రైతులు లేక బోసిపోయిన ఎంవీపీ కాలనీ రైతుబజారు

ఎంవీపీ కాలనీ/ అక్కయ్యపాలెం, సెప్టెంబరు 18: రైతుబజార్లకు సెలవు రద్దు చేసినా, రైతులు గైర్హాజరయ్యారు. ఎంవీపీ కాలనీ, నరసింహనగర్ రైతుబజార్లు ప్రతిరోజూ రద్దీగానే ఉంటాయి. వీటికి బుధవారం సెలవు ఉండేది. ఈ వారం నుంచి సెలవును రద్దు చేస్తూ జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఉత్తర్వులిచ్చారు. కానీ ... మిగతా 6వ పేజీలో

విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉపేంద్ర

- అనకాపల్లి డీఆర్‌గా ఉమామహేశ్వరి
- అల్లూరి డీఆర్‌గా రామలక్ష్మి పట్నాయక్
- డీఐజీ బాలకృష్ణ ఇక్కడే కొనసాగింపు
- నేడు సబ్ రిజిస్ట్రార్ బదిలీలకు మార్గదర్శకాలు?
- సూపర్‌బజారు, మధురవాడ కార్యాలయాల్లో పోస్టింగ్‌కు అధిక డిమాండ్
- భీమిలి, ఆనందపురం, గాజువాక, పెందుర్తిల్లో పనిచేయడానికి చాలామంది ఆసక్తి

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న ఎం.సృజనను తాడేపల్లి బదిలీ చేశారు. ఒంగోలులో పనిచేస్తున్న టి.ఉపేంద్రను విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె.మన్మథరావును విశాఖ జిల్లా మార్కెట్ విలువలు, ఆడిట్ రిజిస్ట్రార్‌గా వేశారు. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా రిజిస్ట్రార్‌గా, కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పి.ఉమామహేశ్వరిని అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీహెచ్.జానకీదేవిని నంద్యాల జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. విశాఖ డీఐజీగా పనిచేస్తున్న బాలకృష్ణను ఇక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మార్గదర్శకాలకు కసరత్తు

సబ్ రిజిస్ట్రార్ల బదిలీల కోసం ఇంకా మార్గదర్శకాలు తయారు చేయలేదు. బుధవారం రాత్రికి గాని, గురువారం కాని వస్తాయని అంటున్నారు. విశాఖపట్నం జిల్లాలో పనిచేయడానికి అనేకమంది ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తి చేసుకున్నవారికి ... మిగతా 6వ పేజీలో

విశాఖ తూర్పు ఏసీపీగా లక్ష్మణమూర్తి



మహారాణిపేట, సెప్టెంబరు 18: విశాఖ తూర్పు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా కె.లక్ష్మణమూర్తి నియమితులయ్యారు. 1995 బ్యాచ్‌లో ఎస్ఐగా ఉద్యోగంలో చేరిన ఆయన టాస్క్‌ఫోర్సు ఎస్ఐగా, అనంతరం నగరంలోని త్రీటౌన్, పీఎం పాలెం, పెందుర్తి, భీమిలి తదితర పోలీసు స్టేషన్లలో సీఐగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అనకాపల్లిలో స్పెషల్ బ్రాంచ్ సీఐగా విధులు నిర్వహిస్తూ డీఎస్పీగా పదోన్నతి పొందటంతో బుధవారం ఆయనను విశాఖ తూర్పు ఏసీపీగా నియమితులయ్యారు.

శ్వాసకోశ వ్యాధులతో బహుపరాక్

»డాక్టర్ ప్రీతి ఠాకూర్ హెచ్చరిక

మహారాణిపేట, సెప్టెంబరు 18: శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల కారణంగా వచ్చే అనారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే కోలుకోవటం ఆలస్యమవుతుందని ఆరోగ్య భద్రత శాస్త్ర నిపుణులు డాక్టర్ ప్రీతీ ఠాకూర్ తెలిపారు. శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల కారణంగా వచ్చే అనారోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై బుధవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో వైద్య విద్యా సదస్సు నిర్వహించారు. డా.ప్రీతి మాట్లాడుతూ భారత వైద్య మండలి ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రస్తుత వాతావరణం కారణంగా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా పెరుగుతున్నాయని తద్వారా ప్రజలకు వైరల్ జ్వరాలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో శరీరంలోని ద్రవాలు ఎలక్ట్రోలైట్ల సమతుల్యత దెబ్బతింటుందన్నారు. అందువల్ల రోగ నిరోధక శక్తి దెబ్బతిని చికిత్స పొందినా రోగి కోలుకోవటానికి అధిక సమయం పడుతుందని ఆమె తెలిపారు. ఇన్‌ఫెక్షన్ నుంచి కోలుకోవటానికి ముందుగా శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా అధికంగా ద్రవాలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలు నమోదు చేయాలి

కంచరపాలెం, సెప్టెంబరు 18 : ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను ప్రశస్త యాప్‌లో నమోదుచేయాలని మండల విద్యాశాఖాధికారి ఎ.సోమేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. అర్బన్ పరిధిలోని నాలుగు మండలాల సైన్స్ ఉపాధ్యాయులకు ఆర్పీపేట స్కూల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ బుధవారంతో ముగిసింది. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించగలగాలంటే ఉపాధ్యాయులు నిత్యంకొత్త విషయాలు నేర్చుకోవాలని విద్యాశాఖాధికారి సూచించారు. ఉపాధ్యాయుడు బి.ఆనంద్ పిల్లల వివరాలను యాప్‌లో నమోదు చేసే విధానాన్ని వివరించారు. హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఆర్పీలు గంట్యాడ ఆనంద్, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మార్గంలో సాంకేతిక లోపం.. రైళ్ల మళ్లింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 18: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వరంగల్, హసన్‌పర్తి, కాజీపేట-ఈ క్యాబిన్ వద్ద తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా విజయనగరం, రాయగడ, టిట్లాఘర్, నాగపూర్ మీదుగా మళ్లించామని పేర్కొన్నారు. మరికొన్ని రైళ్లు గుంటూరు, పగిడిపల్లి మీదుగా నడుస్తాయన్నారు.

విజయనగరం, రాయగడ, టిట్లాఘర్, నాగపూర్ మీదుగా రైళ్లు: ఈ నెల 22 నుంచి అక్టోబరు 6 వరకు విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806); ఈ నెల 26, అక్టోబరు 3న విశాఖ-గాంధీ ధాం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20803); ఈ నెల 29, అక్టోబరు 6న గాంధీ ధాం-విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20804); ఈ నెల 23, 27, 30, అక్టోబరు 4న విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12803); ఈ నెల 25, 29, అక్టోబరు 2, 6న నిజాముద్దీన్-విశాఖ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804); ఈ నెల 22, 29న పూరి-ఓఖా ఎక్స్‌ప్రెస్ (20819); ఈ నెల 25, అక్టోబరు 2న ఓఖా-పూరి ఎక్స్‌ప్రెస్ (20820) రైళ్లు విజయనగరం, రాయగడ, టిట్లాఘర్, నాగపూర్ మీదుగా గమ్యాలకు చేరుతాయని పేర్కొన్నారు.

గుంటూరు, పగిడిపల్లి మీదుగా మళ్లించిన రైళ్లు: ఈ నెల 24 నుంచి అక్టోబరు 2 వరకు విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18520), భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020); ఈ నెల 25 నుంచి అక్టోబరు 2 వరకు ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019); ఈ నెల 28, అక్టోబరు 5, 6న షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); ఈ నెల 29, 30న హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046); అక్టోబరు 7న విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833), ఈ నెల 29న సికింద్రాబాద్-విశాఖ వందేబారత్ ఎక్స్‌ప్రెస్ (20707) రైళ్లు గుంటూరు, పగిడిపల్లి మీదుగా నడుస్తాయి. ఈ నెల 29న యశ్వంత్‌పూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18112) గుంతకల్, నంద్యాల, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తుంది.

రీ షెడ్యూల్

ఈ నెల 27న విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833) రెండు గంటలు ఆలస్యంగా, ఈ నెల 24న సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834) గంట పది నిమిషాలు, హైదరాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (18046) గంటన్నర ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే

కేకే లైనులోని బచేలి, కిరండోల్ మధ్య భారీ వర్షాల కారణంగా విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న రైళ్ల గమ్యాలను కుదించి విశాఖ-దంతెవాడ మధ్య రాకపోకలు సాగించేలా నిర్ణయం తీసుకున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18514), విశాఖ-కిరండోల్ ప్రత్యేక రైలు (08551) సర్వీసులు ఈ నెల 19 నుంచి 25 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18513), కిరండోల్-విశాఖ ప్రత్యేక రైలు (08552) సర్వీసులు ఈ నెల 20 నుంచి 26 వరకు దంతెవాడలో బయలుదేరుతాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను నిలిపివేసినట్లు తెలిపారు.

వలంటీర్ల ప్రదర్శనకు జేసీ ప్రశంస



వలంటీర్ల ప్రదర్శన తిలకిస్తున్న జేసీ మయూర్ అశోక్ తదితరులు

సీతంపేట, సెప్టెంబరు 18: సీతంపేట గురుద్వార కూడలి శాంతిపురంలోని పౌర రక్షణ సంస్థలో శిక్షణ పొందిన 229వ బ్యాచ్ వాలంటీర్ల ప్రదర్శన ఆకట్టుకుంది. శిక్షణ పొందిన 57 మంది వాలంటీర్లు అగ్నికీలలను అదుపుచేయడం, పెద్ద మంటలను ఆర్పివేయడం, బహుళ అంతస్థుల నుంచి ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని కిందికి సురక్షితంగా దించడం తదితర సాహస విన్యాసాలు అబ్బుర పరిచాయని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. వాలంటీర్ల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ అశోక్‌కు తొలుత వాలంటీర్లు గౌరవ వందనం చేశారు. అనంతరం వారు నేర్చుకున్న అంశాల్లో ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినప్పుడు వలంటీర్లు స్వచ్ఛందంగా సహాయం చేయాలన్నారు. ప్రత్యేక ఉప కలెక్టర్ కె.పద్మలత వలంటీర్లకు నేర్పిన శిక్షణ వివరాలను వెల్లడించారు. వలంటీర్లకు ముఖ్య అతిథులు ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన విశ్రాంత వైద్యులు పి.రామారావు, అగ్నిప్రమాద నిరోధక సిబ్బంది, విశ్రాంత అధికారి ఎస్.దేముళ్లు, పోలీసు కమ్యూనికేషన్, సివిల్ డిఫెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

'భూ అక్రమాలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లా'

మాధవధార, సెప్టెంబరు 18: విశాఖ ఉత్తరంలోని నిషేధిత భూముల విషయమై మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ తెలిపారు. అమరావతిలో బుధవారం లోకేష్‌ను కలిసి 22ఎ జాబితాలోని భూములతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని, తప్పుడు డాక్యుమెంట్లతో జరిగిన భూముల వ్యవహారాలను తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరానన్నారు.

నోటిదురుసు తగ్గించుకోండి

జనసేన నేత బొలిశెట్టికి సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ సలహా



సమావేశంలో మాట్లాడుతున్న సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

జగదాంబ కూడలి, సెప్టెంబరు 18: జనసేన పార్టీ నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ స్టీల్ ప్లాంట్ ఉద్యమకారులు, కార్మికులు, కార్మిక సంఘాల పోరాటాలను హేళన చేసే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం జగదాంబ వద్ద సిటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాలపై బొలిశెట్టి అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. కార్మిక సంఘాలు స్టీలు ప్లాంట్ అమ్మకానికి చూస్తున్నాయని, ఇతర అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ నోరుపారేసుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఇంతకీ స్టీలు ప్లాంట్ మీద జనసేన పార్టీ విధానం ఏమిటంటూ నిలదీశారు. స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టాలా ? ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగాలా? అన్న విషయం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వం అంటూ హామీ ఇచ్చిన విషయాన్ని, కార్మిక సంఘాలు సంఘటితంగా 1300 రోజులుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న విషయాన్ని బొలిశెట్టి గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాల్సింది పోయి అవాకులు, చవాకులు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

తీరంలో కలెక్టర్ స్వచ్ఛసేవ



ఆర్కే బీచ్‌లో చెత్త సేకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, మేయర్ కుమారి తదితరులు

మహారాణిపేట, సెప్టెంబరు 18: స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్ పరిసరాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. బుధవారం బీచ్ రోడ్డులోని స్వచ్ఛతా హీ సేవా సమ్మేళతా శిబిరాన్ని ప్రారంభించారు కలెక్టర్ స్వయంగా చెత్తను ఏరివేస్తూ అందరిలో స్ఫూర్తిని నింపారు. ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు, గాజు పెంకులు తదితర వాటిని తీసి తొట్టెలో వేశారు. పర్యాటకులు, సాధారణ పౌరులకు అసౌకర్యం కలగకుండా తీర ప్రాంతాన్ని శుభ్రపరిచారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, పలువురు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుర్గ్ వందేభారత్‌కు ఆదరణ లభించేనా?

... 5వ పేజీ తరువాయి

రూ.1,495 కాగా ఎగ్జిక్యూటివ్ కార్ (ఈసీ) ప్రయాణ చార్జీ రూ.2,760గా నిర్ణయించారు. దీంతో విశాఖ-దుర్గ్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసుల (18529/18530) టికెట్ ధరలతో ప్రయాణికులు పోల్చుకునే పరిస్థితి నెలకొంది. విశాఖ-దుర్గ్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18530/18529) థర్డ్ ఏసీ టికెట్ రూ.895, సెకండ్ ఏసీ ధర రూ.1,280. ఈ నేపథ్యంలో టికెట్ ధరలో భారీ తేడా ఉండడంతో ప్రయాణికులు ఆలోచనలో పడే పరిస్థితులు ఉంటాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలు (18529) దుర్గ్ నుంచి విశాఖ వచ్చేందుకు సుమారు 16 గంటల సమయం పడుతుండగా, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20829) కేవలం ఎనిమిది గంటల్లోనే చేరుతుంది. ఎక్స్‌ప్రెస్ రైలులో (18530) విశాఖ నుంచి దుర్గ్ వెళ్లేందుకు సుమారు 13 గంటల సమయం పడుతుండగా, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20830) కేవలం ఎనిమిది గంటల్లోనే గమ్యానికి చేర్చుతుంది. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల్లో ఆక్యుపెన్సీ పెరిగే అవకాశాలున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పర్యాటకం.. అడ్డగోలు వ్యవహారం

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు అసలు దృష్టి పెట్టినట్టులేదు. దీంతో ఆడింది ఆటగా...పాడింది పాటగా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అదే కొనసాగడం గమనార్హం. పర్యాటక శాఖ లీజులు, పనుల్లో వైసీపీ నేతల ప్రమేయం ఉందని తెలిసినా, వారికి అనుగుణంగా పనిచేసిన ఇంజనీరింగ్ అధికారులే కళ్ల ముందు తిరుగుతున్నా కూటమి నేతలు పట్టించుకోవడం లేదు. అప్పుఘర్ వద్ద రూ.11 కోట్లతో ఏం చేశారు?, అంత మొత్తం పెడితే కొత్త భవనం కట్టొచ్చు కదా?.... పాత వాటికి రంగులు వేయడం ఏమిటని ఒక్కరు కూడా ప్రశ్నించడం లేదు. ఇప్పటివరకూ పర్యాటక శాఖపై సరైన సమీక్ష కూడా నిర్వహించకపోవడం గమనార్హం.

రైతుబజార్లు వెలవెల



నరసింహనగర్ రైతుబజారులో స్టాళ్లను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖాధికారి యాసిన్

... 5వ పేజీ తరువాయి

అధికశాతం రైతులు బజార్‌కు రాలేదు. ఎంవీపీ కాలనీ బజారులో సుమారు 300 మంది రైతులు తమ ఉత్పత్తులను విక్రయిస్తుంటారు. బుధవారం కేవలం 32 మంది వచ్చారు. వారంలో ఒక రోజు సెలవు కావాలని వారు అంటున్నారు. మిగిలిన రోజుల్లో తెల్లవారుజామునే బయలుదేరి రావడం, చీకటిపడిన తర్వాత ఇంటికి చేరడంతో ఇతర పనులు కావడం లేదంటున్నారు. ఇక నరసింహనగర్ రైతుబజారుకు కేవలం నలుగురు ఆకుకూరల రైతులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, ఇద్దరు గుడ్ల వ్యాపారులు, కిరాణా దుకాణం, పాల వ్యాపారి మాత్రమే వచ్చారు. రైతుబజారును మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ తనిఖీ చేశారు. బజారుకు ఎంతమంది రైతులు వచ్చారో పరిశీలించి వినియోగదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యాపారులు కూడా సెలవు కావాలని చెప్పారు. ఆయన వెంట ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు పాల్గొన్నారు.

భర్తపై అనుమానంతో వివాహిత ఆత్మహత్య

కంచరపాలెం, సెప్టెంబరు 18 : భర్తపై అనుమానంతో గొడవపడి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక రెడ్డికంచరపాలెంలో నివాసం ఉంటున్న దేవాది కుసుమ (35)కు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఇంటికి సమీపంలో ఇస్త్రీ బండిని నడుపుతూ ఉంటాడు. అయితే భర్తపై అనుమానంతో భార్య కుసుమ తరుచూ గొడవ పడేదని కుటుంబ సభ్యులు అంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భర్తతో గొడవపడిన అనంతరం కుటుంబ సభ్యులు నిద్రకు ఉపక్రమించగా బుధవారం తెల్లవారు జామున పడకగదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని కుసుమ ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు కంచరపాలెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కుసుమ సోదరుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోలు మార్ఫింగ్ చేసిన మహిళ కటకటాల్లోకి..

ఎండాడ, సెప్టెంబరు 18: సోషల్ మీడియాలో చాటింగ్‌లు చేసి, వారి ఫొటోలు, వీడియోలను సేకరించి, మార్ఫింగ్ చేసి వాటిని తిరిగి సోషల్ మీడియాలో పెట్టిన మహిళను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారు అందించిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఒక మహిళకి గుర్తు తెలియని నంబరు నుంచి ఫోన్ వచ్చింది. మీ అమ్మాయి నాతో చాటింగ్ చేస్తోందని, మా ఇద్దరికీ పెళ్లి చేయాలని కోరాడు. అనుమానం వచ్చిన అమ్మాయి తల్లిదండ్రులు ఆరా తీయగా.. తమ కుమార్తె పేరు మీద సోషల్ మీడియాలో ఉన్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్స్‌లో ఉన్న ఫొటోలు, వీడియోలు డౌన్‌లోడ్ చేసుకుని, ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి ఓ మహిళ చాటింగ్ చేస్తోందని తెలిసింది. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యక్తి తమకు ఫోన్ చేశాడని గుర్తించారు. దీంతో సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. వారు సాంకేతికతను వినియోగించి, మార్ఫింగ్ ఫొటోలతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న హైదరాబాద్‌కు చెందిన నాగిరెడ్డి ఇందిరా వైఫ్‌ఆఫ్ నాగిరెడ్డి విజయ్‌కుమార్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరికొంత మంది కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

టాస్క్‌గేమ్‌లకు అకౌంట్స్ అందించిన వ్యక్తి అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 18: టాస్క్ గేమ్ ఫ్రాడ్ కోసం బ్యాంక్ ఖాతాలను సరఫరా చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన కొంతమంది యువతీ, యువకులకు పార్ట్‌టైమ్ జాబ్స్ అంటూ వాట్సాప్‌లో మెసేజ్‌లు వచ్చాయి. మీరు టాస్క్ గేమ్‌లు ఆడితే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. తొలుత సింపుల్‌టాస్క్‌లు ఇచ్చి కొంత డబ్బులు వచ్చిన తర్వాత కమీషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని నియమించేలా ఫేక్ వెబ్‌సైట్ డిజైన్ చేసి టాస్క్ పూర్తిచేయాలంటూ రూ.86,28,961 కొట్టేశారు. కేసుకు సంబంధించి ముంబై వెళ్లిన సైబర్ క్రైం పోలీసులు బ్యాంకు ఖాతాలను అందించిన హితేన్ ప్రవీన్ చంద్ర, సుకేష్ ముదన్న నుంచి సేకరించిన సమాచారంతో సుదీప్ బబ్లూను అరెస్టు చేశారు. ఈ కేసులో మరి కొంతమంది కోసం గాలిస్తున్నారు.

కవితా వస్తువులో రసరమ్యత ప్రధానం



మాట్లాడుతున్న రచయిత డాక్టర్ పేరి రవికుమార్

సీతంపేట, సెప్టెంబరు 18: దేని గురించి కవిత్వం రాయాలా? అనేది కవితా వస్తువు అవుతుందని, పూర్వ కావ్యాలలో దీనికి కొన్ని నియమాలు ఉండేవని రచయిత డాక్టర్ పేరి రవికుమార్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ కవితా వస్తువుల్లో రసరమ్యత ప్రధానమన్నారు. ఆధునిక కాలంలో కవితా వస్తువు విస్తృతి పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో సహృదయ సాహితీ సంస్థ ప్రతినిధి శేఖర్ మంత్రి ప్రభాకర్, డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, రాంభట్ల నరసింహశర్మ, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, డాక్టర్ కేవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేసినవారిని ఉపేక్షించం

»నర్సింగ్ పోరాట కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సూర్యకళ

జగదాంబ కూడలి, సెప్టెంబరు 18: రాష్ట్ర కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగుల కోసం ఏర్పాటైన పోరాట కమిటీపై తప్పుడు ప్రచారం చేయడం పట్ల రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యురాలు, ఘోషా ఆసుపత్రి నర్సింగ్ ఉద్యోగి కె.సూర్యకళ అభ్యంతరం వ్యక్తం చేశారు. డబ్బులు వసూళ్లంటూ తమపై తప్పుడు ప్రచారాలకు తెర తీసిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరినీ బెదిరించి ఉద్యమం చేయడం లేదు. అడ్డగోలు దందాలకు పాల్పడలేదని స్పష్టంచేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఏఎన్ఎంలకు నర్సింగ్ ఉద్యోగులుగా పదోన్నతి కల్పించడాన్ని నిరసిస్తూ చేపడుతున్న ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిన జీవో 115ను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు నర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో కోడెనాగు

సీతమ్మధార, సెప్టెంబరు 18: సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోని విశ్రాంత గదిలోకి విషపూరితమైన కోడెనాగు పాము ప్రవేశించింది. గమనించిన సిబ్బంది అధికారులకు తెలిపారు. దీంతో పాములు పట్టే కిరణ్‌కుమార్‌ను రప్పించారు. కిరణ్‌కుమార్ చాకచక్యంగా పామును పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇది పిల్ల పాము అని స్నేక్ క్యాచర్ కిరణ్ తెలిపారు..



పామును పట్టుకున్న కిరణ్ కుమార్

'వర్గీకరణ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి'



ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

మహారాణిపేట, సెప్టెంబరు 18: ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో న్యాయపరమైన అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం విశాఖ వచ్చిన ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రను మిషన్ అధ్యక్ష, కార్యదర్శులు బయ్యా మల్లయ్య, ఎస్.మోహన బాబు, ఇతర సభ్యులు కలిసి వినతిపత్రం అందించారు. కమిషన్ సభ్యుడు రామచంద్ర మాట్లాడుతూ అట్రాసిటీ చట్టం అమలు తీరు, ఎస్సీలకు ప్రభుత్వ రంగ సంస్థల్లో పదోన్నతులు బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో పురోగతిపై సమీక్షిస్తామన్నారు. ఉపాధ్యక్షులు దాసరి పుల్లారావు, మోరి గణేషు, సునీల్ కుమార్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లేబర్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన బీజేపీ నాయకులు

కంచరపాలెం: జాతీయ లేబర్ కమిషన్ చైర్మన్ నగరానికి బుధవారం విచ్చేసిన నేపథ్యంలో బీజేపీ ఎస్సీ సెల్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ఎస్సీ సెల్ మెర్నా నాయకులు గుడిపే దేవానంద్, గనిరెడ్డి రాకేష్ చంద్ర ఉన్నారు. వీరు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు.

మన్యం ధీరుడు సినిమాను ఆదరించాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 18: మన్యం ధీరుడు సినిమాను ఆదరించాలని రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి కోరారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమాశంలో ఆయన మాట్లాడారు. "సినిమా నిర్మాణంతో పాటు అల్లూరి సీతారామరాజు పాత్ర ధరించిన ఆర్‌వీవీ సత్యనారాయణ సాహసంగా నిర్మించారన్నారు. ఈ నెల 20న సినిమా విడుదల కానుందన్నారు. నిర్మాత ఆర్‌వీవీ సత్యనారాయణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉపేంద్ర

... 5వ పేజీ తరువాయి

బదిలీ చేయాలని సూచించింది. అయితే రెండేళ్లు దాటిన వారి నుంచి కూడా దరఖాస్తులు ఆహ్వానించింది. నేరుగా ఉన్నతాధికారులే బదిలీ చేస్తారా?, కౌన్సెలింగ్ నిర్వహిస్తారా? అనేది ఇంకా స్పష్టత లేదు. కొన్ని జిల్లాల్లో సబ్ రిజిస్ట్రార్ పోస్టుల కోసం లక్షల రూపాయలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని వార్తలు రావడంతో ప్రభుత్వం బదిలీలను సీరియస్‌గా తీసుకుంది. ఆరోపణలకు తావు లేని విధంగా చేయాలని భావిస్తోంది.

విశాఖ జిల్లాలో తొమ్మిది కార్యాలయాలు ఉండగా వాటిలో సూపర్‌బజారు, మధురవాడ కార్యాలయాల పోస్టులకు డిమాండ్ అధికంగా ఉంది. అలాగే భీమిలి, ఆనందపురం, గాజువాక, పెందుర్తి కార్యాలయాల్లో పనిచేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ పదవీ కాలం ఇంకో ఆరు నెలలే ఉన్నందున ఆయన్ను అక్కడి నుంచి కదపరని చెబుతున్నారు. భీమిలి సబ్ రిజిస్ట్రార్‌పై ఇటీవల ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేశారు. ఆయన కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకొని అక్కడే కొనసాగుతున్నారు. వైసీపీ నాయకుని బంధువు కావడంతో ఆయన్ను అక్కడి నుంచి మార్చవచ్చునని అంటున్నారు. నగరంలో కొన్ని కార్యాలయాల్లో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు యూనియన్‌లో కీలక పదవులు నిర్వహిస్తున్నారు. అటువంటి వారిని కోటా ప్రకారం మరో టర్మ్ కొనసాగించే అవకాశం ఉంది. అయితే వారు అవే స్థానాలు కోరుకుంటారా?, ఇతర కార్యాలయాల ఆప్షన్ తీసుకుంటారా? అనేది చూడాలి. ఇక, ఎనీవేర్ డాక్యుమెంట్లను ఎడాపెడా చేసేస్తున్నారని పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్‌ను పక్కన పెట్టారు. ఆయన సెలవులో వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్‌తో కార్యాలయం నడిపిస్తున్నారు. అక్కడ కొత్తవారిని నియమించే అవకాశం ఉందని సమాచారం. సబ్ రిజిస్ట్రార్ల పోస్టులకు కూడా ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు ఇచ్చారు. వాటిని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుంటారా?, లేదా? అనేది చూడాలి. జిల్లా రిజిస్ట్రార్ల బదిలీల్లో కొన్నింటిని రాజకీయ సిఫారసులను దృష్టిలో పెట్టుకొని చేశారు. కాబట్టి ఎమ్మెల్యేలు కోరుకున్నవారే జిల్లాలో కీలక స్థానాల్లోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు.



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీవారి పల్లకీ సేవ

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 18: పౌర్ణమి సందర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో బుధవారం శ్రీవారికి ప్రత్యేక పూజలతో పాటు పల్లకీ సేవ చేపట్టారు. వేదపండితులు వేంకటేశ్వరస్వామిని పంచామృతాలతో అభిషేకించాక పూజలు చేశారు. సాయంత్రంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను వేదపండితులు అధిష్ఠింపజేశారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణ మధ్య పల్లకీలో స్వామి, అమ్మవార్లను వైభవంగా ఊరేగించారు. పాలక మండలి సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గాజువాక, సెప్టెంబరు 18: గాజువాకలోని ప్రభుత్వ ఐటీఐలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం నాలుగో విడత అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న సర్టిఫికెట్ల పరిశీలన చేపడతామన్నారు. ఇంతకుముందు దరఖాస్తు చేసినవారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని, అటువంటి అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన చేయడం జరగదన్నారు. 28వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

గాజువాక, సెప్టెంబరు 18: జీవీఎంసీ 65వ వార్డు పరిధి బానోజీతోట ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిథిగా విచ్చేసి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీపై ఉన్న నమ్మకంతో దేశవ్యాప్తంగా ఇప్పటికే రెండు కోట్ల మంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. దేశాభివృద్ధికి పీఎం మోదీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు ఎంతో ఆకర్షితువుతున్నారన్నారు. యువత బీజేపీ సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్, అనురాగ్‌సింగ్, రామస్వామి, నాయుడు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సత్కారం

అగనంపూడి, సెప్టెంబరు 18: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి, పరిసర ప్రాంత కాలనీల్లో గల మాజీ సైనికులను బుధవారం విశ్వేశ్వర నగర్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షురాలు పద్మావతి మాట్లాడుతూ దేశం కోసం మాజీ సైనికులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు బలిరెడ్డి సత్యనారాయణ, మాజీ సైనికులు విందుల సూర్యారావు, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, వి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

జిప్సా ఎన్నికలు రేపు

పెదగంట్యాడ, సెప్టెంబరు 18: ఈ నెల 20న జిప్సా ఎన్నికలను నిర్వహిస్తామని, అదేరోజు ఫలితాలను ప్రకటిస్తామని జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు పలువురు బుధవారం ఎన్నికల అధికారులైన పరుచూరి ప్రభాకర్, రాఘవరాజు, జగ్గారావులకు పలువురు నామినేషన్ పత్రాలను అందజేశారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 44, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 22, క్యారెట్ 40, దొండకాయలు 30, బంగాళదుంపలు 30, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 110, అరటికాయ (పెద్దది) 8, బరబాటి 44, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 74, పొటల్స్ 44, కీరదోస 32, క్యాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడుచిక్కుడు 68, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ IIలో..



ప్రజాధనం వృథా..

మూడున్నరేళ్లుగా రహదారుల పక్కన నిరుపయోగంగా పడి ఉన్న యూజీడీ పైపులు

గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమే కారణమంటున్న ప్రజలు

పెదగంట్యాడ, సెప్టెంబరు 18: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్‌కు ఉపయోగపడాల్సిన పైపులు, యూజీడీ పిట్స్ రహదారుల పక్కన, కాలువ గట్లపై, ముళ్ల పొదల్లో, పలు నివాసాలను ఆనుకుని నిరుపయోగంగా పడి ఉన్నాయి. సుమారు మూడున్నరేళ్లుగా ఇవి ఆయాచోట్ల ఎందుకూ పనికిరాకుండా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని పైపులు, పిట్స్ విరిగిపోవడం, కొన్ని పిట్స్ మట్టిలో కూరుకపోవడం జరిగింది.



హెచ్‌బీ కాలనీ నుంచి సీతానగరం వెళ్లే రోడ్డు పక్కన ఉన్న యూజీడీ పైపులు

జీవీఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వీటి పరిస్థితిని గమనించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇవి రోడ్ల పక్కన గుట్టలుగా ఉండడం, కొన్నిసార్లు జారిపోయి రహదాల పైకి వచ్చేస్తుండడంతో పక్కకు తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని కాలనీలకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ అమలు చేయాలని జీవీఎంసీ నిర్ణయించింది. ఇందుకు అవసరమైన పైపులు, పిట్స్‌ను ఎక్కడో తయారు చేయించి ఇక్కడకు రవాణా చేయడం భారీ ఖర్చుతో కూడుకున్న పని అని భావించిన అధికారులు ఇక్కడి హౌసింగ్ బోర్డు కాలనీ పక్కనే వీటిని తయారు చేయించారు. అధికారులు ఇచ్చిన అంచనా మేరకు కాంట్రాక్టర్ వీటిని తయారుచేశారు. అయితే వీటిని వినియోగించకపోవడంతో ఇవి గుట్టలుగా పేరుకుపోయాయి. హౌసింగ్‌బోర్డు కాలనీ నుంచి గంగవరం పోర్టుకు వెళ్లే రోడ్డులో ఎక్కడికక్కడ ఇవి దర్శనమిస్తున్నాయి. వీటిని ఒకచోట నుంచి మరోచోటకు మార్చాలంటే క్రేన్‌ను వినియోగించాల్సిన పరిస్థితి ఉంది. ఎంతో ఆర్భాటంగా యూజీడీ స్కీమ్‌ను ప్రవేశపెట్టిన గత ప్రభుత్వం.. ఈ పథకాన్ని నిధుల కొరత వల్ల మధలోనే వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో కాలనీల్లో యూజీడీ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రూ.లక్షలు వెచ్చించి చేయించిన పైపులు, పిట్స్ రోడ్ల పక్కన, పొదల్లో ఉండడం పట్ల నిర్వాసిత కాలనీల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పైపులను తొలగించాలని అధికారులకు ఎప్పుడో చెప్పాం

-జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు



యూజీడీ పథకం అమలుకు ఇక్కడ తయారుచేసిన పైపులు, పిట్స్‌ను అవసరమైన ప్రాంతాలకు తరలించాలని జీవీఎంసీ అధికారులకు మూడేళ్ల క్రితమే చెప్పాం. హౌసింగ్ బోర్డు రోడ్డుకు, కాలువకు మధ్యనున్న ఖాళీ స్థలంలో సుమారు వెయ్యి మొక్కలు నాటాం. ఆ ప్రదేశమంతా పైపులు, పిట్స్‌ను గుట్టలుగా వేయడం వల్ల చాలా మొక్కలు పాడైపోయాయి. ఈ పైపుల గుట్టల్లో పాములు, ఇతర విషకీటకాలు చేరడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.



70వ వార్డు కుంచుమాంబ కాలనీ వినాయక గుడి సమీపంలో పేరుకుపోయిన చెత్త

పేరుకుపోయిన చెత్తను తరలించరూ..

ఆటోనగర్, సెప్టెంబరు 18: జీవీఎంసీ 71వ వార్డు పరిధిలోని కుంచుమాంబ కాలనీ వినాయకుని ఆలయ సమీపంలో చెత్తాచెదారంతో డస్ట్‌బిన్ నిండిపోవడంతో రోడ్డంతా వ్యాపిస్తుంది. రోజుల తరబడి చెత్తాచెదారం, కోడి వ్యర్థాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వస్తుందని స్థానికులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భరించరాని దుర్వాసన వల్ల వినాయకుని ఆలయంలో కాసేపు కూడా ఉండలేకపోతున్నామని పలువురు భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడి చెత్తను తరలించాలని కోరుతున్నారు.

ఉక్కు కర్మాగారానికి ఊపిరి పోయాలి

పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు యు.రామస్వామి



...మాట్లాడుతున్న రామస్వామి

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 18: ఎంతోమంది బలిదానాలు, త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఊపిరి పోయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు యు.రామస్వామి కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,315వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు కేంద్ర ఉక్కు శాఖామంత్రి కుమారస్వామి ప్రకటించాలన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని, ఇందుకోసం అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశాన్ని చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లు నిర్వహించి ప్రధాని మోదీపై ఒత్తిడి తేవాలని అన్నారు. ఉక్కు కర్మాగారాన్ని సీఎం చంద్రబాబు గాడిలో పెట్టగలరని కార్మికులంతా విశ్వసిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



గాజువాకలోని ఓ ప్రాంతంలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది



డ్రోన్ సాయంతో చెరువులో దోమల మందు స్ప్రే చేస్తున్న దృశ్యం

దోమల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

పలు వార్డుల్లో ఫాగింగ్ నిర్వహణ

డ్రోన్ల సాయంతో చెరువుల్లో మందు స్ప్రే

గాజువాక, సెప్టెంబరు 18: గాజువాక నియోజకవర్గ పరిధిలో దోమల నియంత్రణకు అధికారులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. పలు వార్డుల్లోని లోతట్టు ప్రాంతాలు, చెరువుల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారు. దోమలు నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో యాంటీ మలేరియా యూనిట్ రంగంలోకి దిగింది. పలు ప్రాంతాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయడంతో పాటు చెరువుల్లో దోమల మందు స్ప్రే చేసేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. పెద్దపెద్ద చెరువులు, లోతట్టు ప్రాంతాల్లో సిబ్బందితో దోమల మందు స్ప్రేయింగ్ చేసేందుకు ఇబ్బందిగా మారడంతో ఆయాచోట్ల డ్రోన్లను రంగంలోకి దింపారు. నియోజకవర్గ పరిధిలోని 68, 69, 79, 85, 86, 88, వార్డుల్లో డ్రోన్ల సాయంతో దోమల మందును స్ప్రే చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు అన్న క్యాంటీన్లు ప్రారంభం

వేపగుంట, సెప్టెంబరు 18: జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయ పరిధిలోని పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గంలోని అన్న క్యాంటీన్లను గురువారం ప్రారంభించనున్నట్టు జెడ్సీ కె.హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. పెందుర్తి, వేపగుంటల్లోని అన్న క్యాంటీన్లను గురువారం రాత్రి ఏడు గంటలకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ప్రారంభించనున్నారు. గోపాలపట్నం రైతు బజారు, బాజీ జంక్షన్ సంత ప్రాంగణంలో గల అన్న క్యాంటీన్లను ఉదయం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభిస్తారని, ఈ మేరకు వాటిని సిద్ధం చేశామన్నారు.

మల్కాపురం: శ్రీహరిపురం, గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను గురువారం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఈ రెండు అన్న క్యాంటీన్లను సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను కేవలం ఐదు రూపాయలకే అందిస్తారు.



ముస్తాబైన శ్రీహరిపురంలోని అన్న క్యాంటీన్



రక్తదాన శిబిరంలో ఎంపీ సీఎం రమేశ్, తదితరులు

ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికుడు

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

పెందుర్తి, సెప్టెంబరు 18: వన్ ఇండియా-బెస్ట్ ఇండియా దార్శనికుడు ప్రధాని నరేంద్ర మోదీ అని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. బుధవారం పెందుర్తిలో ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని బీజేపీ జిల్లా కన్వీనర్ గొర్లె రామునాయుడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలమ భవన్‌లో ఏర్పాటు చేసిన మెగా వైద్య, రక్తదాన శిబిరాన్ని ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. మోదీ నాయకత్వంలో భారత్‌లో ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. సమాజంలో ప్రతి వ్యక్తి సంక్షేమంపై శ్రద్ధ చూపుతూ మోదీ భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ఠ చేస్తున్నారని పేర్కొన్నారు. అంతకుముందు బీజేపీ సభ్యత్వ నమోదును సీఎం రమేశ్ ప్రారంభించారు. కాగ రక్తదా శిబిరంలో 20 మంది రక్తదానం చేయగా, వారికి ధ్రువీకరణ పత్రాలను ఎంపీ అందజేశారు. అలాగే సుమారు 200 మంది రోగులకు వైద్యులు వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, నాయకులు ద్వారపూడి పరమేశ్వరరావు, నాదేళ్ల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

గోపాలపట్నం, సెప్టెంబరు 18: ఫీడర్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, డీఏఆర్ నగర్, సంతోశ్‌నగర్, భగత్‌సింగ్ నగర్, ఎల్లపువానిపాలెం, చంద్రనగర్, పాత గోపాలపట్నం, నేతాజీ వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు, గోపాపలట్నం మెయిన్ రోడ్డు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

కార్పొరేటర్‌ను పరామర్శించిన మేయర్ దంపతులు

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 18: జీవీఎంసీ 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తండ్రి బి.అప్పలనాయుడు ఈ నెల ఎనిమిదిన మృతి చెందడంతో బుధవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు బుచ్చిరాజుపాలెంలోని రమణ నివాసానికి వచ్చి పరామర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, దాడి వెంకటరమేశ్, పీవీ నరసింహం, రాపర్తికన్నా, సేనాపతి వసంతకల్యాణి, ఉరుకూటి చందు, రాజాన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డీజీఎం రాధికకు సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 18: ప్రతిష్ఠాత్మకమైన జెండర్ డైవర్సిటీ అవార్డు అందుకున్న స్టీల్‌ప్లాంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) డి.రాధికను బుధవారం ప్లాంట్‌లోని కోకోవెన్ విభాగం వద్ద కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ ఉద్యోగుల సంక్షేమం కోసం రాధిక ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో నాయకులు తాండ్ర కనకరాజు, కొమ్ము ప్రసాదరావు, శివరామకృష్ణ, టీవీకే రాజు, కేవీ రత్నం, రమణాజీ రావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తదితరులు

విత్తన బంతులు తయారు చేసిన విద్యార్థులు

గోపాలపట్నం, సెప్టెంబరు 18: స్థానిక జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇక్కడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు విత్తన బంతులను తయారుచేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలో విత్తన బంతుల తయారీ, పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల పండ్ల మొక్కల విత్తనాలను బంతులుగా తయారుచేయించి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఏటా వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాటు విత్తన బంతులు పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా చేపడుతున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

వినాయక మండపాల వద్ద అన్న సమారాధనలు



అన్న సమారాధనలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



భోజనాలు వడ్డిస్తున్న మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు, తదితరులు

పెందుర్తి, సెప్టెంబరు 18: పెందుర్తిలోని దొగ్గవానిపాలెం, పాత పెందుర్తి, పార్వతీనగర్‌లో గల వినాయక మండపాల వద్ద చేపట్టిన అన్న సమారాధన కార్యక్రమాలను మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కేబుల్ రాజు, విజయలక్ష్మి, పెంటకోట కృష్ణ, మురళీ,రాజు, ఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు పరిధి కరాసలోని బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయ కమిటీ, కరాస రాక్ స్టార్స్ సభ్యులు నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా చేపట్టిన అన్న సమారాధనను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. వందలాది మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. 90వ వార్డు పరిధి ఎస్ఏడీ ఇందిరా ప్రియదర్శిని కాలనీలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సంతర్పణను ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ, జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఇ-మర్రిపాలెం గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన వినాయక ఉత్సవాలు ముగిశాయి. ఇందులో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరాము నాయుడు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కూటమి నాయకులు దుల్ల సంజయ్, దుల్ల చెల్లారావు, వరంబాబు, గణపతి, దేముడు, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాంలోని విజయ రాఘవస్వామి ఆలయం వద్ద గణపతి ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధనను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయన గణేశునికి పూజలు చేశారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


శ్మశానవాటికలో పిచ్చిమొక్కల తొలగింపు

అగనంపూడి, సెప్టెంబరు 18: జీవీఎంసీ 79వ వార్డు పరిధి ఏలేరు కాలువ సమీపంలోని శశ్మానవాటిక వద్ద ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపునకు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ చర్యలు చేపట్టారు. బుధవారం ఆయన దగ్గరుండి ఎక్స్‌కవేటర్ సాయంతో శశ్మానవాటిక లోపల, పరిసరాల్లోని ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

అగనంపూడి, సెప్టెంబరు 18: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక కొండపై వెలసిన శ్రీమాతా దుర్గాభవానీ ఆలయ అభివృద్ధికి సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు రూ.10 వేల విరాళాన్ని ఆలయ ధర్మకర్త బల్ల పైడిరాజుకు అందజేశారు.





విశాఖ తూర్పు ఏసీపీగా లక్ష్మణమూర్తి



మహారాణిపేట, సెప్టెంబరు 18: విశాఖ తూర్పు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా కె.లక్ష్మణమూర్తి నియమితులయ్యారు. 1995 బ్యాచ్‌లో ఎస్ఐగా ఉద్యోగంలో చేరిన ఆయన టాస్క్‌ఫోర్సు ఎస్ఐగా, అనంతరం నగరంలోని త్రీటౌన్, పీఎం పాలెం, పెందుర్తి, భీమిలి తదితర పోలీసు స్టేషన్లలో సీఐగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అనకాపల్లిలో స్పెషల్ బ్రాంచ్ సీఐగా విధులు నిర్వహిస్తూ డీఎస్పీగా పదోన్నతి పొందటంతో బుధవారం ఆయనను విశాఖ తూర్పు ఏసీపీగా నియమితులయ్యారు.

శ్వాసకోశ వ్యాధులతో బహుపరాక్

»డాక్టర్ ప్రీతి ఠాకూర్ హెచ్చరిక

మహారాణిపేట, సెప్టెంబరు 18: శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల కారణంగా వచ్చే అనారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే కోలుకోవటం ఆలస్యమవుతుందని ఆరోగ్య భద్రత శాస్త్ర నిపుణులు డాక్టర్ ప్రీతీ ఠాకూర్ తెలిపారు. శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల కారణంగా వచ్చే అనారోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై బుధవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో వైద్య విద్యా సదస్సు నిర్వహించారు. డా.ప్రీతి మాట్లాడుతూ భారత వైద్య మండలి ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రస్తుత వాతావరణం కారణంగా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా పెరుగుతున్నాయని తద్వారా ప్రజలకు వైరల్ జ్వరాలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో శరీరంలోని ద్రవాలు ఎలక్ట్రోలైట్ల సమతుల్యత దెబ్బతింటుందన్నారు. అందువల్ల రోగ నిరోధక శక్తి దెబ్బతిని చికిత్స పొందినా రోగి కోలుకోవటానికి అధిక సమయం పడుతుందని ఆమె తెలిపారు. ఇన్‌ఫెక్షన్ నుంచి కోలుకోవటానికి ముందుగా శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా అధికంగా ద్రవాలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలు నమోదు చేయాలి

కంచరపాలెం, సెప్టెంబరు 18 : ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను ప్రశస్త యాప్‌లో నమోదుచేయాలని మండల విద్యాశాఖాధికారి ఎ.సోమేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. అర్బన్ పరిధిలోని నాలుగు మండలాల సైన్స్ ఉపాధ్యాయులకు ఆర్పీపేట స్కూల్లో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ బుధవారంతో ముగిసింది. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధించగలగాలంటే ఉపాధ్యాయులు నిత్యంకొత్త విషయాలు నేర్చుకోవాలని విద్యాశాఖాధికారి సూచించారు. ఉపాధ్యాయుడు బి.ఆనంద్ పిల్లల వివరాలను యాప్‌లో నమోదు చేసే విధానాన్ని వివరించారు. హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు. ఆర్పీలు గంట్యాడ ఆనంద్, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మార్గంలో సాంకేతిక లోపం.. రైళ్ల మళ్లింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 18: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వరంగల్, హసన్‌పర్తి, కాజీపేట-ఈ క్యాబిన్ వద్ద తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా విజయనగరం, రాయగడ, టిట్లాఘర్, నాగపూర్ మీదుగా మళ్లించామని పేర్కొన్నారు. మరికొన్ని రైళ్లు గుంటూరు, పగిడిపల్లి మీదుగా నడుస్తాయన్నారు.

విజయనగరం, రాయగడ, టిట్లాఘర్, నాగపూర్ మీదుగా రైళ్లు: ఈ నెల 22 నుంచి అక్టోబరు 6 వరకు విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806); ఈ నెల 26, అక్టోబరు 3న విశాఖ-గాంధీ ధాం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20803); ఈ నెల 29, అక్టోబరు 6న గాంధీ ధాం-విశాఖ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20804); ఈ నెల 23, 27, 30, అక్టోబరు 4న విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12803); ఈ నెల 25, 29, అక్టోబరు 2, 6న నిజాముద్దీన్-విశాఖ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804); ఈ నెల 22, 29న పూరి-వోకా ఎక్స్‌ప్రెస్ (20819); ఈ నెల 25, అక్టోబరు 2న వోకా-పూరి ఎక్స్‌ప్రెస్ (20820) రైళ్లు విజయనగరం, రాయగడ, టిట్లాఘర్, నాగపూర్ మీదుగా గమ్యాలకు చేరుతాయని పేర్కొన్నారు.

గుంటూరు, పగిడిపల్లి మీదుగా మళ్లించిన రైళ్లు: ఈ నెల 24 నుంచి అక్టోబరు 2 వరకు విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18520), భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020); ఈ నెల 25 నుంచి అక్టోబరు 2 వరకు ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019); ఈ నెల 28, అక్టోబరు 5, 6న షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); ఈ నెల 29, 30న హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046); అక్టోబరు 7న విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833), ఈ నెల 29న సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20707) రైళ్లు గుంటూరు, పగిడిపల్లి మీదుగా నడుస్తాయి. ఈ నెల 29న యశ్వంత్‌పూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18112) గుంతకల్, నంద్యాల, గుంటూరు, విజయవాడ మీదుగా నడుస్తుంది.

రీ షెడ్యూల్

ఈ నెల 27న విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833) రెండు గంటలు ఆలస్యంగా, ఈ నెల 24న సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834) గంట పది నిమిషాలు, హైదరాబాద్-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (18046) గంటన్నర ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే

కేకే లైనులోని బచేలి, కిరండోల్ మధ్య భారీ వర్షాల కారణంగా విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న రైళ్ల గమ్యాలను కుదించి విశాఖ-దంతెవాడ మధ్య రాకపోకలను సాగించేలా నిర్ణయం తీసుకున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18514), విశాఖ-కిరండోల్ ప్రత్యేక రైలు (08551) సర్వీసులు ఈ నెల 19 నుంచి 25 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18513), కిరండోల్-విశాఖ ప్రత్యేక రైలు (08552) సర్వీసులు ఈ నెల 20 నుంచి 26 వరకు దంతెవాడలో బయలుదేరుతాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను నిలిపివేసినట్లు తెలిపారు.

వలంటీర్ల ప్రదర్శనకు జేసీ ప్రశంస



వలంటీర్ల ప్రదర్శన తిలకిస్తున్న జేసీ మయూర్ అశోక్ తదితరులు

సీతంపేట, సెప్టెంబరు 18: సీతంపేట గురుద్వార కూడలి శాంతిపురంలోని పౌర రక్షణ సంస్థలో శిక్షణ పొందిన 229వ బ్యాచ్ వాలంటీర్ల ప్రదర్శన ఆకట్టుకుంది. శిక్షణ పొందిన 57 మంది వాలంటీర్లు అగ్నికీలలను అదుపుచేయడం, పెద్ద మంటలను ఆర్పివేయడం, బహుళ అంతస్థుల నుంచి ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని కిందికి సురక్షితంగా దించడం తదితర సాహస విన్యాసాలు అబ్బుర పరిచాయని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. వాలంటీర్ల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ అశోక్‌కు తొలుత వాలంటీర్లు గౌరవ వందనం చేశారు. అనంతరం వారు నేర్చుకున్న అంశాల్లో ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినప్పుడు వలంటీర్లు స్వచ్ఛందంగా సహాయం చేయాలన్నారు. ప్రత్యేక ఉప కలెక్టర్ కె.పద్మలత వలంటీర్లకు నేర్పిన శిక్షణ వివరాలను వెల్లడించారు. వలంటీర్లకు ముఖ్య అతిథులు ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన విశ్రాంత వైద్యులు పి.రామారావు, అగ్నిప్రమాద నిరోధక సిబ్బంది, విశ్రాంత అధికారి ఎస్.దేముళ్లు, పోలీసు కమ్యూనికేషన్, సివిల్ డిఫెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

'భూ అక్రమాలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లా'

మాధవధార, సెప్టెంబరు 18: విశాఖ ఉత్తరంలోని నిషేధిత భూముల విషయమై మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి సనపల వరప్రసాద్ తెలిపారు. అమరావతిలో బుధవారం లోకేష్‌ను కలిసి 22ఏ జాబితాలోని భూములతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని, తప్పుడు డాక్యుమెంట్లతో జరిగిన భూముల వ్యవహారాలను తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని కోరానన్నారు.

నోటిదురుసు తగ్గించుకోండి

జనసేన నేత బొలిశెట్టికి సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ సలహా



సమావేశంలో మాట్లాడుతున్న సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

జగదాంబ కూడలి, సెప్టెంబరు 18: జనసేన పార్టీ నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ స్టీల్ ప్లాంట్ ఉద్యమకారులు, కార్మికులు, కార్మిక సంఘాల పోరాటాలను హేళన చేసే విధంగా వ్యాఖ్యలు చేయడాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం జగదాంబ వద్ద సిటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాలపై బొలిశెట్టి అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. కార్మిక సంఘాలు స్టీలు ప్లాంట్ అమ్మకానికి చూస్తున్నాయని, ఇతర అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ నోరుపారేసుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఇంతకీ స్టీలు ప్లాంట్ మీద జనసేన పార్టీ విధానం ఏమిటంటూ నిలదీశారు. స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టాలా ? ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగాలా? అన్న విషయం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వం అంటూ హామీ ఇచ్చిన విషయాన్ని, కార్మిక సంఘాలు సంఘటితంగా 1300 రోజులుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న విషయాన్ని బొలిశెట్టి గుర్తుంచుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవాల్సింది పోయి అవాకులు, చవాకులు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కవితా వస్తువులో రసరమ్యత ప్రధానం



మాట్లాడుతున్న రచయిత డాక్టర్ పేరి రవికుమార్

సీతంపేట, సెప్టెంబరు 18: దేని గురించి కవిత్వం రాయాలా? అనేది కవితా వస్తువు అవుతుందని, పూర్వ కావ్యాలలో దీనికి కొన్ని నియమాలు ఉండేవని రచయిత డాక్టర్ పేరి రవికుమార్ పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ కవితా వస్తువుల్లో రసరమ్యత ప్రధానమన్నారు. ఆధునిక కాలంలో కవితా వస్తువు విస్తృతి పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో సహృదయ సాహితీ సంస్థ ప్రతినిధి శేఖర్ మంత్రి ప్రభాకర్, డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, రాంభట్ల నరసింహశర్మ, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, డాక్టర్ కేవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేసినవారిని ఉపేక్షించం

»నర్సింగ్ పోరాట కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సూర్యకళ

జగదాంబ కూడలి, సెప్టెంబరు 18: రాష్ట్ర కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగుల కోసం ఏర్పాటైన పోరాట కమిటీపై తప్పుడు ప్రచారం చేయడం పట్ల రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యురాలు, ఘోషా ఆసుపత్రి నర్సింగ్ ఉద్యోగి కె.సూర్యకళ అభ్యంతరం వ్యక్తం చేశారు. డబ్బులు వసూళ్లంటూ తమపై తప్పుడు ప్రచారాలకు తెర తీసిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరినీ బెదిరించి ఉద్యమం చేయడం లేదు. అడ్డగోలు దందాలకు పాల్పడలేదని స్పష్టంచేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఏఎన్ఎంలకు నర్సింగ్ ఉద్యోగులుగా పదోన్నతి కల్పించడాన్ని నిరసిస్తూ చేపడుతున్న ఆందోళనలను ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిన జీవో 115ను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు నర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో కోడెనాగు

సీతమ్మధార, సెప్టెంబరు 18: సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలోని విశ్రాంత గదిలోకి విషపూరితమైన కోడెనాగు పాము ప్రవేశించింది. గమనించిన సిబ్బంది అధికారులకు తెలిపారు. దీంతో పాములు పట్టే కిరణ్‌కుమార్‌ను రప్పించారు. కిరణ్‌కుమార్ చాకచక్యంగా పామును పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇది పిల్ల పాము అని స్నేక్ క్యాచర్ కిరణ్ తెలిపారు..



పామును పట్టుకున్న కిరణ్ కుమార్

'వర్గీకరణ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లండి'

మహారాణిపేట, సెప్టెంబరు 18: ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో న్యాయపరమైన అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం విశాఖ వచ్చిన ఎస్సీ కమీషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రను మిషన్ అధ్యక్ష, కార్యదర్శులు బయ్యా మల్లయ్య, ఎస్.మోహన బాబు, ఇతర సభ్యులు కలిసి వినతిపత్రం అందించారు. కమీషన్ సభ్యుడు రామచంద్ర మాట్లాడుతూ అట్రాసిటీ చట్టం అమలు తీరు, ఎస్సీలకు ప్రభుత్వ రంగ సంస్థల్లో పదోన్నతులు బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో పురోగతిపై సమీక్షిస్తామన్నారు. ఉపాధ్యక్షులు దాసరి పుల్లారావు, మోరి గణేషు, సునీల్ కుమార్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

జాతీయ లేబర్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన బీజేపీ నాయకులు

కంచరపాలెం: జాతీయ లేబర్ కమిషన్ చైర్మన్ నగరానికి బుధవారం విచ్చేసిన నేపథ్యంలో బీజేపీ ఎస్సీ సెల్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ఎస్సీ సెల్ మెర్సా నాయకులు గుడిపే దేవానంద్, గనిరెడ్డి రాకేష్ చంద్ర ఉన్నారు. వీరు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు.

మన్యం ధీరుడు సినిమాను ఆదరించాలి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 18: మన్యం ధీరుడు సినిమాను ఆదరించాలని రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి కోరారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమాశంలో ఆయన మాట్లాడారు. "సినిమా నిర్మాణంతో పాటు అల్లూరి సీతారామరాజు పాత్ర ధరించిన ఆర్‌వీవీ సత్యనారాయణ సాహసంగా నిర్మించారన్నారు. ఈ నెల 20న సినిమా విడుదల కానుందన్నారు. నిర్మాత ఆర్‌వీవీ సత్యనారాయణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉపేంద్ర

... 5వ పేజీ తరువాయి

బదిలీ చేయాలని సూచించింది. అయితే రెండేళ్లు దాటిన వారి నుంచి కూడా దరఖాస్తులు ఆహ్వానించింది. నేరుగా ఉన్నతాధికారులే బదిలీ చేస్తారా?, కౌన్సెలింగ్ నిర్వహిస్తారా? అనేది ఇంకా స్పష్టత లేదు. కొన్ని జిల్లాల్లో సబ్ రిజిస్ట్రార్ పోస్టుల కోసం లక్షల రూపాయలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని వార్తలు రావడంతో ప్రభుత్వం బదిలీలను సీరియస్‌గా తీసుకుంది. ఆరోపణలకు తావు లేని విధంగా చేయాలని భావిస్తోంది.

విశాఖ జిల్లాలో తొమ్మిది కార్యాలయాలు ఉండగా వాటిలో సూపర్‌బజారు, మధురవాడ కార్యాలయాల పోస్టులకు డిమాండ్ అధికంగా ఉంది. అలాగే భీమిలి, ఆనందపురం, గాజువాక, పెందుర్తి కార్యాలయాల్లో పనిచేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ పదవీ కాలం ఇంకో ఆరు నెలలే ఉన్నందున ఆయన్ను అక్కడి నుంచి కదపరని చెబుతున్నారు. భీమిలి సబ్ రిజిస్ట్రార్‌పై ఇటీవల ఆరోపణలు రావడంతో సస్పెండ్ చేశారు. ఆయన కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకొని అక్కడే కొనసాగుతున్నారు. వైసీపీ నాయకుని బంధువు కావడంతో ఆయన్ను అక్కడి నుంచి మార్చవచ్చునని అంటున్నారు. నగరంలో కొన్ని కార్యాలయాల్లో పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు యూనియన్‌లో కీలక పదవులు నిర్వహిస్తున్నారు. అటువంటి వారిని కోటా ప్రకారం మరో టర్మ్ కొనసాగించే అవకాశం ఉంది. అయితే వారు అవే స్థానాలు కోరుకుంటారా?, ఇతర కార్యాలయాల ఆప్షన్ తీసుకుంటారా? అనేది చూడాలి. ఇక, ఎనీవేర్ డాక్యుమెంట్లను ఎడాపెడా చేసేస్తున్నారని పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్‌ను పక్కన పెట్టారు. ఆయన సెలవులో వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్‌తో కార్యాలయం నడిపిస్తున్నారు. అక్కడ కొత్తవారిని నియమించే అవకాశం ఉందని సమాచారం. సబ్ రిజిస్ట్రార్ల పోస్టులకు కూడా ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు ఇచ్చారు. వాటిని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుంటారా?, లేదా? అనేది చూడాలి. జిల్లా రిజిస్ట్రార్ల బదిలీల్లో కొన్నింటిని రాజకీయ సిఫారసులను దృష్టిలో పెట్టుకొని చేశారు. కాబట్టి ఎమ్మెల్యేలు కోరుకున్నవారే జిల్లాలో కీలక స్థానాల్లోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

తీరంలో కలెక్టర్ స్వచ్ఛసేవ



ఆర్కే బీచ్‌లో చెత్త సేకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, మేయర్ కుమారి తదితరులు

మహారాణిపేట, సెప్టెంబరు 18: స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్ పరిసరాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. బుధవారం బీచ్ రోడ్డులోని స్వచ్ఛతా హీ సేవా సమ్మైక్యతా శిబిరాన్ని ప్రారంభించారు కలెక్టర్ స్వయంగా చెత్తను ఏరివేస్తూ అందరిలో స్ఫూర్తిని నింపారు. ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు, గాజు పెంకులు తదితర వాటిని తీసి తొట్టెలో వేశారు. పర్యాటకులు, సాధారణ పౌరులకు అసౌకర్యం కలగకుండా తీర ప్రాంతాన్ని శుభ్రపరిచారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, పలువురు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుర్గ్ వందేభారత్‌కు ఆదరణ లభించేనా?

... 5వ పేజీ తరువాయి

రూ.1,495 కాగా ఎగ్జిక్యూటివ్ కార్ (ఈసీ) ప్రయాణ చార్జీ రూ.2,760గా నిర్ణయించారు. దీంతో విశాఖ-దుర్గ్ మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసుల (18529/18530) టికెట్ ధరలతో ప్రయాణికులు పోల్చుకునే పరిస్థితి నెలకొంది. విశాఖ-దుర్గ్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (18530/18529) థర్డ్ ఏసీ టికెట్ రూ.895, సెకండ్ ఏసీ ధర రూ.1,280. ఈ నేపథ్యంలో టికెట్ ధరలో భారీ తేడా ఉండడంతో ప్రయాణికులు ఆలోచనలో పడే పరిస్థితులు ఉంటాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ రైలు (18529) దుర్గ్ నుంచి విశాఖ వచ్చేందుకు సుమారు 16 గంటల సమయం పడుతుండగా, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20829) కేవలం ఎనిమిది గంటల్లోనే చేరుతుంది. ఎక్స్‌ప్రెస్ రైలులో (18530) విశాఖ నుంచి దుర్గ్ వెళ్లేందుకు సుమారు 13 గంటల సమయం పడుతుండగా, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20830) కేవలం ఎనిమిది గంటల్లోనే గమ్యానికి చేర్చుతుంది. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల్లో ఆక్యుపెన్సీ పెరిగే అవకాశాలున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

పర్యాటకం.. అడ్డగోలు వ్యవహారం

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు అసలు దృష్టి పెట్టినట్టులేదు. దీంతో ఆడింది ఆటగా...పాడింది పాటగా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అదే కొనసాగడం గమనార్హం. పర్యాటక శాఖ లీజులు, పనుల్లో వైసీపీ నేతల ప్రమేయం ఉందని తెలిసినా, వారికి అనుగుణంగా పనిచేసిన ఇంజనీరింగ్ అధికారులే కళ్ల ముందు తిరుగుతున్నా కూటమి నేతలు పట్టించుకోవడం లేదు. అప్పుఘర్ వద్ద రూ.11 కోట్లతో ఏం చేశారు?, అంత మొత్తం పెడితే కొత్త భవనం కట్టొచ్చు కదా?.... పాత వాటికి రంగులు వేయడం ఏమిటని ఒక్కరు కూడా ప్రశ్నించడం లేదు. ఇప్పటివరకూ పర్యాటక శాఖపై సరైన సమీక్ష కూడా నిర్వహించకపోవడం గమనార్హం.

రైతుబజార్లు వెలవెల



నరసింహనగర్ రైతుబజారులో స్టాళ్లను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖాధికారి యాసిన్

... 5వ పేజీ తరువాయి

అధికశాతం రైతులు బజార్‌కు రాలేదు. ఎంవీపీ కాలనీ బజారులో సుమారు 300 మంది రైతులు తమ ఉత్పత్తులను విక్రయిస్తుంటారు. బుధవారం కేవలం 32 మంది వచ్చారు. వారంలో ఒక రోజు సెలవు కావాలని వారు అంటున్నారు. మిగిలిన రోజుల్లో తెల్లవారుజామునే బయలుదేరి రావడం, చీకటిపడిన తర్వాత ఇంటికి చేరడంతో ఇతర పనులు కావడం లేదంటున్నారు. ఇక నరసింహనగర్ రైతుబజారుకు కేవలం నలుగురు ఆకుకూరల రైతులు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, ఇద్దరు గుడ్ల వ్యాపారులు, కిరాణా దుకాణం, పాల వ్యాపారి మాత్రమే వచ్చారు. రైతుబజారును మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ తనిఖీ చేశారు. బజారుకు ఎంతమంది రైతులు వచ్చారో పరిశీలించి వినియోగదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యాపారులు కూడా సెలవు కావాలని చెప్పారు. ఆయన వెంట ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు పాల్గొన్నారు.

భర్తపై అనుమానంతో వివాహిత ఆత్మహత్య

కంచరపాలెం, సెప్టెంబరు 18 : భర్తపై అనుమానంతో గొడవపడి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక రెడ్డికంచరపాలెంలో నివాసం ఉంటున్న దేవాది కుసుమ (35)కు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త ఇంటికి సమీపంలో ఇస్త్రీ బండిని నడుపుతూ ఉంటాడు. అయితే భర్తపై అనుమానంతో భార్య కుసుమ తరుచూ గొడవ పడేదని కుటుంబ సభ్యులు అంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భర్తతో గొడవపడిన అనంతరం కుటుంబ సభ్యులు నిద్రకు ఉపక్రమించగా బుధవారం తెల్లవారు జామున పడకగదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని కుసుమ ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు కంచరపాలెం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కుసుమ సోదరుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోలు మార్ఫింగ్ చేసిన మహిళ కటకటాల్లోకి..

ఎండాడ, సెప్టెంబరు 18: సోషల్ మీడియాలో చాటింగ్‌లు చేసి, వారి ఫొటోలు, వీడియోలను సేకరించి, మార్ఫింగ్ చేసి వాటిని తిరిగి సోషల్ మీడియాలో పెట్టిన మహిళను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారు అందించిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఒక మహిళకి గుర్తు తెలియని నంబరు నుంచి ఫోన్ వచ్చింది. మీ అమ్మాయి నాతో చాటింగ్ చేస్తోందని, మా ఇద్దరికీ పెళ్లి చేయాలని కోరాడు. అనుమానం వచ్చిన అమ్మాయి తల్లిదండ్రులు ఆరా తీయగా.. తమ కుమార్తె పేరు మీద సోషల్ మీడియాలో ఉన్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్స్‌లో ఉన్న ఫొటోలు, వీడియోలు డౌన్‌లోడ్ చేసుకుని, ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసి ఓ మహిళ చాటింగ్ చేస్తోందని తెలిసింది. ఈ నేపథ్యంలో సంబంధిత వ్యక్తి తమకు ఫోన్ చేశాడని గుర్తించారు. దీంతో సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. వారు సాంకేతికతను వినియోగించి, మార్ఫింగ్ ఫొటోలతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న హైదరాబాద్‌కు చెందిన నాగిరెడ్డి ఇందిరా వైఫ్ఆఫ్ నాగిరెడ్డి విజయ్‌కుమార్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరికొంత మంది కోసం గాలిస్తున్నట్టు తెలిపారు.

టాస్క్‌గేమ్‌లకు అకౌంట్స్ అందించిన వ్యక్తి అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 18: టాస్క్ గేమ్ ఫ్రాడ్ కోసం బ్యాంక్ ఖాతాలను సరఫరా చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన కొంతమంది యువతీ, యువకులకు పార్ట్‌టైమ్ జాబ్స్ అంటూ వాట్సాప్‌లో మెసేజ్‌లు వచ్చాయి. మీరు టాస్క్ గేమ్‌లు ఆడితే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. తొలుత సింపుల్‌టాస్క్‌లు ఇచ్చి కొంత డబ్బులు వచ్చిన తర్వాత కమీషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని నియమించేలా ఫేక్ వెబ్‌సైట్ డిజైన్ చేసి టాస్క్ పూర్తిచేయాలంటూ రూ.86,28,961 కొట్టేశారు. కేసుకు సంబంధించి ముంబై వెళ్లిన సైబర్ క్రైం పోలీసులు బ్యాంకు ఖాతాలను అందించిన హితేన్ ప్రవీన్ చంద్ర, సుకేష్ ముదన్న నుంచి సేకరించిన సమాచారంతో సుదీప్ బబ్లూను అరెస్టు చేశారు. ఈ కేసులో మరి కొంతమంది కోసం గాలిస్తున్నారు.

బోధనా సామగ్రితో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 18: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో ఎం.శివరాణి ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని పొట్టిశ్రీరాములు జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో రెండురోజులుగా జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, బోధనాభ్యసన సామగ్రిని వినియోగించుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు ఆర్.అప్పలరాజు, అమర్నాథ్‌శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు 'అల్లూరి' పేరుపై హర్షం

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబర్ 18: భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరిసీతారామరాజు పేరు ఖరారు చేస్తూ, రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై క్షత్రియ కార్పొరేషన్ పోరాట సమితి కన్వీనరు జి. రఘురామరాజు, కో కన్వీనరు బుద్దరాజు శివాజీరాజు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వానికి క్షత్రియుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

షామియానా రంగంలో సమస్యల పరిష్కారానికి కృషి



టెంట్ ఎక్స్‌పో ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మంగవేణి

ఎం.వి.పి.కాలనీ, సెప్టెంబరు 18 : షామియానాల వ్యాపార రంగంలోని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని 18 వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి అన్నారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో బుధవారం జరిగిన టెంట్ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ రంగంలోని సమస్యలను స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎంపీ శ్రీభరత్ ద్వారా ప్రభుత్వం దృష్టిలోకి తీసుకువెళ్తామన్నారు. జిల్లా కోర్టు బార్ సోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ది వైజాగ్ పటం ఫంక్షన్ మెటీరియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ న్యాయ సలహాదారు ఎస్‌వీ సుమన్, అధ్యక్షుడు సి.హెచ్.సుబ్బారావు తదితరులు మాట్లాడుతూ షామియానా రంగాన్ని చిన్నతరహా పరిశ్రమగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్య క్రమంలో విజయనగరం, కాకినాడ, రామహేంద్రవరం, భీమవరం, విజయవాడ తదితర ప్రాంతాల ప్రతినిధులు ఈ పాల్గొన్నారు.

భీమిలి ఎస్‌ఐగా గౌరి బాధ్యతల స్వీకరణ



భీమునిపట్నం, సెప్టెంబరు 18: భీమిలి శాంతి, భద్రతల పోలీసుస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్. గౌరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన పైడిరాజు విశాఖ రేంజ్‌కు బదిలీ అయ్యారు. ఎండాడ మహిళా పోలీసు స్టేషన్ నుంచి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పోలీసుల అదుపులో బైక్ దొంగలు

ఆరిలోవ. సెప్టెంబరు 18: ఆరిలోవ టీఐసీ పాయింట్ సమీపాన ముస్తాఫానగర్‌నకుచెందిన ఎస్‌కే షరీఫ్ తన స్కూటీని ఇద్దరు వ్యక్తులు బలవంతంగా గత నెల 17 వ తేదీన ఎంవీపి కాలనీ ఆదర్శనగర్‌లోని ఓ బార్ వద్ద తీసుకుపోయినట్టు నగర సీపీ శంఖ బ్రత బాగ్చీకి ఫిర్యాదు చేశారు. దీనితో కమిషనర్ ఆదేశాలపై గురవారం ఈ వాహనం నడుపుతున్న శివాజీనగర్‌కి చెందిన సంతోష్, పెదవాల్తేర్‌కు బి. నరిసింహమూర్తిని ఏఎస్ రాజా సర్కిల్ వద్ద స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వ్యసనాలకు బానిసలైన వీరు చోరీకి పాల్పడినట్లు పోలీసులుతెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 53, టమాటా 39, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 42, బీరకాయలు 44, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 44, క్యాబేజ్ 22, క్యారెట్ 40, దొండకాయలు 30, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 110, బరబటి 44, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 44, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 74, పొటల్స్ 44, కీరదోస 32, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 54, కంద 60, దేముడు చిక్కుడు 68, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్రాయిలర్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIలో..



ఆరిలోవలో అన్న క్యాంటీన్...



ఎంవీపీ కాలనీ రైతు బజారు వద్ద ఫర్నిచర్‌తో సిద్ధమైన క్యాంటీన్

ఆపన్నుల ఆకలి తీర్చేలా..

- 'తూర్పు'లో నేటినుంచి నాలుగు అన్న క్యాంటీన్లు ప్రారంభం
- సర్వాంగ సుందరంగా భవనాలు
- పేద, మధ్య తరగతి వర్గాల్లో హర్షం

ఎం.వి.పి.కాలనీ, సెప్టెంబరు 18: తూర్పునియోజకవర్గ పరిధిలో గురువారం అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. గతంలో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్లు ఎంతో మంది ఆకలి తీర్చేవి. అనంతరం 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చి వీటిని తొలగించిన విషయం తెలిసిందే. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఇవి పునః ప్రారంభిస్తున్నారు. పేదలకు రూ.5కే రుచికరమైన భోజనం, అల్పాహారం అందించనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కొన్నిచోట్ల ప్రారంభించగా, తూర్పు నియోజకవర్గంలో నాలుగు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను సిద్ధం చేశారు. ఎంవీపీ కాలనీ రైతు బజారు వద్ద, హనుమంతువాక విమ్స్ ఆసుపత్రి సమీపంలో, ఆరిలోవ ఐదో సెక్టరులో, పెదవాల్తేరు ఇఎన్‌టీ, ఛాతి, మానసిక వైద్య శాలల సమీపంలో క్యాంటీన్లను మళ్లీ సర్వాంగ సుందరంగా అన్ని వసతులతో తీర్చిదిద్దారు. ఎంవీపీ కాలనీ రైతు బజారు వద్ద ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ రైతులకు, సమీపంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రికి వివిధ జిల్లాల నుంచి వచ్చే రోగులు, బంధువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పెద వాల్తేరులో నాలుగు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారికి ఆకలి తీర్చనుంది. హనుమంతువాక వద్ద విమ్స్ ఆసుపత్రికి వచ్చేవారితో పాటు, సింహాచలం దారిలో వెళ్లేవారికి అనుకూలం. ఆరిలోవ కాలనీలో పేద కుటుంబాలున్నాయి. రోజు కూలీ చేసుకునేవారు కూడా ఇక్కడ ఎక్కువ. ఇక్కడ కూడా అన్న క్యాంటీన్ ఆదరణ పొందనుంది.

రూ. 15 లక్షలతో ఒక్కో భవనం పునర్నిర్మాణం

వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఈ భవనాలు దెబ్బతిన్నాయి. ఈస్థితిలో వీటిని మరమ్మతుకు ఒక్కో భవనం రూ.15 లక్షలు విడుదలయ్యాయి. ఇవి పూర్తి సౌకర్యాలతో అధికారులు సిద్ధం చేశారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా కంప్యూటరైజ్డ్ టోకెన్ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని క్యాంటీన్లలో తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటుచేశారు. భోజనాలు చేయడానికి స్టీలు బల్లలు, బెంచీలకు మార్బుల్ పలకలను అతికించారు. పూర్వ వైభవం కనిపించేలా భవనాల ఎలివేషన్‌లో అన్న క్యాంటీన్ పేరుతో పాటు, ఎన్టీఆర్, చంద్రబాబు చిత్రాలను ఉంచారు.

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. 9వ వార్డులోని సంజయగాంధీకాలనీలోని బీఆర్‌టీఎస్‌కు ఆనుకుని విమ్స్ ఆస్పత్రి ఎదుట, ఆరిలోవ వద్ద 13వ వార్డులో వీటిని ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం 7 గంటలకు మిమ్స్ ఆస్పత్రి వద్ద అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించనున్నారు. భోజనం రూ. 5, అల్పాహారం రూ. 5కు అందించనున్నారు.

బార్ అసోసియేషన్‌కు లా బుక్స్ బహూకరణ



పుస్తకాలు అందిస్తున్న న్యాయమూర్తులు

భీమునిపట్నం, సెప్టెంబరు 18: భీమిలి కోర్టు బార్ అసోసియేషన్‌కు పట్టణ పీడీఎం కోర్టు న్యాయమూర్తి నాగేశ్వర్‌రావు, ఒకటవ ఏడీఎం కోర్టు జడ్జి సౌజన్య న్యాయవాదులకు అవసరమైన లా బుక్స్‌ను బహూకరించారు. బుధవారం బార్ అసోసియేషన్‌ను వారు సందర్శించి కొత్తగా అమెండ్ అయిన కొత్త సెక్షన్స్, వాటితో న్యాయవాదులకు అవసరమైన సుమారు రూ.25వేల విలువైన ఈ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పార్వతీశం, సుధాకర్ మాట్లాడుతూ, లా బుక్స్ అందించడమేగాక, మెజిస్ట్రేట్ పరీక్షలకు సిద్ధమవుతున్న జూనియరు న్యాయవాదులకు అవసరమైన కోచింగ్ మెటీరియల్, ఖర్చులు కూడా స్పాన్సర్ చేస్తామని జడ్జీలు హామీ ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థులకు పతకాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 18: నల్గొండ జిల్లాలో జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ 7 అథ్లెటిక్స్ పోటీల్లో భీమిలి బీచ్‌రోడ్ తిమ్మాపురం విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ విద్యార్థులు 5 బంగారు , 8 కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా, ప్రిన్సిపాల్ సిహెచ్. చైతన్య మాట్లాడుతూ, అండర్-14, 17 బాలుర విభాగాల్లో వీరు ఈ పతకాలు సాధించారన్నారు. వారణాసిలో త్వరలో జరగనున్న జాతీయ సెలక్షన్స్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా, ఈ విద్యార్థులను పూలమాలతో సత్కరించి అభినందించారు. పిఈటీ శివగణేష్‌ను కూడా అభినందించారు.

పద్మనాభం ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు రేపు

పద్మనాభం, సెప్టెంబరు 18: పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయంలో ఈనెల 20న రాజయోగి బి.కె. మంజునాథ్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్టు బ్రహ్మకుమారీలు చెప్పారు. సత్యనారాయణస్వామి కథను వివరిస్తూ భక్తులతో ఈ వ్రతాలు నిర్వహిస్తామన్నారు. ఈవ్రతంలో పాల్గొనే దంపతులు ఫోన్లు: 83095 53085, 93935 52284, 90521 75672ల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

విరివిగా మొక్కల పెంపకానికి ప్రణాళిక

- వీఎంఆర్డీఏ కమిషనరు కేఎస్ విశ్వనాథన్



కైలాసగిరిపై విత్తన బంతులను వెదజల్లుతున్న విశ్వనాథన్

విశాలాక్షినగర్, సెప్టెంబరు 18: వీఎంఆర్డీఏ పరిధిలో విరివిగా మొక్కల పెంపకానికి ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో కైలాసగిరి పై విత్తనబంతులు వెదజల్లే కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భూతాపం పెరిగి ప్రకృతి వైపరీత్యాలు తరచూ సంభవిస్తున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు తక్షణం చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరూ ఒక మొక్కను విధిగా నాటాలన్నారు. విశాఖను గ్రీన్ సిటీగా మార్చటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. 35 రకాలైన వృక్ష జాతులకు చెందిన సుమారు మూడు వేల బంతులను గ్రీన్ క్లైమెట్ పర్యవేక్షణలో కైలాసగిరి కొండపై వెదచల్లినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, డీఎఫ్‌వో శాంతి స్వరూప్, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకులు రత్నం, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై వైభవంగా అప్పన్న పౌర్ణమి తిరువీధి



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

సింహాచలం, సెప్టెంబరు 18: వరాహ లక్ష్మీనృసింహస్వామి తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బాద్రపదమాస శుక్లపక్ష పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయ దేవేరులతో పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదపఠనాల మధ్య సింహగిరి మాడవీధుల్లో తిరువీధి జరిగింది. మార్గం పొడవునా పలువురు భక్తులు ఫలాల నివేదనలు, కర్పూర నీరాజనాలతో ఆహ్వానం పలికారు.

దుర్గా నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వేస్తున్న సంఘ సభ్యులు

సింహాచలం, సెప్టెంబరు 18: అక్టోబరు 3నుంచి ప్రారంభం కానున్న దుర్గామాత నవరాత్ర మహోత్సవాలకు 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, అడివివరం సహకార పరపతి సంఘం పాలకమండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామితో కలిసి భూమి పూజచేశారు. బుధవారం ఉదయం సింహగిరి తొలిపావంచా వద్ద ఖాళీ ప్రదేశంలో పందిరిరాట వేశారు. వేదపండితుడు సుబ్రహ్మణ్యం మంత్రోచ్ఛరణల మధ్య ఈ కార్య క్రమం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కందాళ ఫణిమనోహర్, మజ్జి చంద్ర శ్రీనివాసరావు, కొలుసు రామారావు, బంటుబిల్లి రామకృష్ణ, బోర ప్రసాద్ రెడ్డి, ఎస్. అప్పారావు, తోమురోతు రాము పాల్గొన్నారు.

నిర్మాణ సామగ్రి లారీ అడ్డగింత

- రోడ్డు పాడవుతుందంటూ నర్సాపురం గ్రామస్థుల నిరసన



లారీని అడ్డుకుంటున్న గ్రామస్థులు

పద్మనాభం, సెప్టెంబరు 18: మండలంలోని తునివలస పంచాయతీ పరిధి నర్సాపురంలో జగనన్న కాలనీ లేఅవుట్‌కు నిర్మాణ సామగ్రితో వెళ్తున్న లారీని గ్రామస్థులు బుధవారం రాత్రి అడ్డుకున్నారు. అధిక బరువుతో ఈ లారీలు రావడంతో రోడ్డు పాడవడంతోపాటు మంచినీటి పైపులైన్లు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో కాంట్రాక్టర్‌కు, గ్రామస్థులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎట్టకేలకు పైపలైను మరమ్మతులు చేపట్టేందుకు కాంట్రాక్టరు అంగీకరించడంతో వివాదం సద్దుమనిగింది.

నాగుపాము కలకలం



నాగుపాముతో స్నేక్ క్యాచర్

ఎండాడ, సెప్టెంబరు 18: గీతం ఆసుపత్రి వెనుక నాగుపాము కలకలం రేపింది. ఆస్పత్రి వెనుక గల తోటలో ఎనిమిది అడుగుల నాగుపాము బుధవారం స్థానికులు గుర్తించి, స్నేక్ క్యాచర్ శ్రీనివాస్‌కి సమాచారం అందించారు. ఆయన వచ్చిన నాగుపాముని పట్టుకుని జన సంచారం లేని ప్రదేశంలో విడిచి పెట్టారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

సింహాచలం, సెప్టెంబరు 18: బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్మాణంతో 98 వార్డు పరిధిలో తాగునీటి సరఫరాలో లోపాలు తలెత్తారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ పీవీ నరసింహం పలు ప్రాంతాల్లో పర్యటించారు. సమస్యను పరిష్కరించి ప్రజలకు కావలసిన మేరకు తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఎండాడ, సెప్టెంబరు 18: యువతి అదృశ్యంపై పీఎం పాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలివి.. మధురవాడలోని బక్కన్నపాలెంలో యువతి (20) తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది. కొమ్మాదిలోని ఓ రెస్టారెంట్‌లో విధులు నిర్వహిస్తూ ఉదయం వెళ్లి సాయంత్రం విధులు ముగించుకుని ఇంటి వచ్చేది. 17 విధులకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరకపోవడంతో తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బాధితునికి ఆర్థికసాయం

సింహాచలం: గ్రేటర్ 98వ వార్డుకు చెందిన కోరాడ వెంకటేష్ గత కొంతకాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యా డు. విషయం తెలసుకున్న స్థానిక నరసింహ యూత్ ఫ్రెండ్ తమ మిత్రునికి తమ వంతుగా రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

ప్రధాని మోదీ దార్శనికుడు

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



రక్తదాన శిబిరంలో ఎంపీ సీఎం రమేశ్, తదితరులు

పెందుర్తి, సెప్టెంబరు 18: వన్ ఇండియా-బెస్ట్ ఇండియా దార్శనికుడు ప్రధాని నరేంద్ర మోదీ అని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. బుధవారం పెందుర్తిలో ప్రధాని మోదీజన్మదినోత్సవాన్ని బీజేపీ జిల్లా కన్వీనర్ గొర్లె రామునాయుడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలమ భవన్‌లో ఏర్పాటు చేసిన మెగా వైద్య, రక్తదాన శిబిరాన్ని ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. మోదీ నాయకత్వంలో భారత్‌లో ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. సమాజంలో ప్రతి వ్యక్తి సంక్షేమంపై శ్రద్ధ చూపుతూ భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ట చేస్తు న్నారని పేర్కొన్నారు. ముందుగా బీజేపీ సభ్యత్వ నమోదును సీఎం రమేశ్ ప్రారంభించారు. కాగా రక్తదా శిబిరంలో 20 మంది రక్తదానం చేయగా, వారికి ధ్రువీకరణ పత్రాలను ఎంపీ అందజేశారు. సుమారు 200 మం ది రోగులకు వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, నాయ కులు ద్వారపూడి పరమేశ్వరరావు, నాదేళ్ల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధనలు



అన్నదానం ప్రారంభిస్తున్న టీడీపీ నేత నగేశ్‌కుమార్

పద్మనాభం(రూరల్), సెప్టెంబరు 18: మండలం మద్ది గ్రామంలో వినాయక ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నసమారాధనను బుధవారం టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కాళ్ల నగేశ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్య క్రమానికి మాజీ సర్పంచ్ కాళ్ల సత్యవతి, టీడీపీ నాయకులు బుగత శ్రీనివాసరావు (బుజ్జి), బుగత ప్రకాష్, ఎం.సన్నిబాబు, బుగత రాజు, కాళ్ల రవి, నల్లి గిరి సహాయ సహకారం అందించారు.

పద్మనాభం: రేవిడిలో గణపతి నవరాత్రులు పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. జిల్లా పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షుడు మరగడ అప్పారావు, స్థానిక నాయకులు ఎం.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రెడ్డిపల్లిలోని రామాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఉత్సవ కమిటీ సభ్యులు దాతలు పాపారావు, హిమవతి దంపతులు పాల్గొన్నారు.

గణపతి అనుపోత్సవ సంబరాలు

పద్మనాభం సంతబయలులో నిలిపిన వినాయకుడిని భారీ ఊరేగింపుతో అనుపోత్సవం నిర్వహించారు. శేరిఖండంలో జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నిలిపిన వినాయకుడిని నిమజ్జన కార్య క్రమం నిర్వహించారు. పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

'రెల్లివీధి సమస్యలు పరిష్కరిస్తా'

భీమునిపట్నం, సెప్టెంబరు 18: స్థానిక రెల్లి వీధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీ పీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు హామీ ఇచ్చారు. బుధవారం ఆ వీధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా, పైలట్ వాటర్ సప్లై స్కీమ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ పర్యటనలో నాయకులు జలగడుగుల మురళి, తిరుపతిరావు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో స్వచ్ఛతా హీ సేవ

సింహాచలం, సెప్టెంబరు 18: వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వచ్ఛ హి సేవ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఈవో ఎన్ సుజాత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పారిశుధ్య విభాగ అధికారి పిళ్లా శ్రీనివాసరావు, పర్యవేక్షణాధికారి ప్రసన్నలక్ష్మీ ఆధ్వర్యంలో సిబ్బంది దక్షిణ రాజగోపురం నుంచి అన్నప్రసాద భవనం వరకు పరిసరాలను శుభ్రం చేశారు.

పాఠశాల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే బాలుడి మృతి

- భీమిలి స్టేషన్ ఎదుట నారాయణరాజుపేట గ్రామస్థుల నిరసన
- సీఐ, డీఈవో చర్చలు.. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ

భీమునిపట్నం, సెప్టెంబరు 18: మండలంలోని నారాయణరాజుపేటలో ఐదేళ్ల చిన్నారి వేణుతేజ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ ఆ గ్రామస్థులు బుధవారం రాత్రి భీమిలిలోని పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. రేవిడిలోని ఆంధ్రా స్కూల్‌కు చెందిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో గత నెలలో మజ్జిపేట వద్ద ఓ విద్యార్థిని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్నారు. ఇలా ఇంకెంతమంది ప్రాణాలు బలిగొంటాడంటూ నినాదాలు చేశారు. పాఠశాల యాజమాన్యం నుంచి కానీ, చట్టపరంగా కానీ నిందితులకు తగిన శిక్ష విధించ లేదని వాపోయారు. తమ కుమారుడు మళ్లీ రాడని, మరొకరికి ఇలా కడుపుకోతకు లోనవకుండా ఆ పాఠశాలను మూసివేయాలని బాలుడి తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకూ ఇక్కడే ఉంటామని భీష్మించారు. కొద్దిసేపటి తర్వాత జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, టీడీపీ నాయకులు గాడు తాతినాయుడు అక్కడకు చేరుకుని పోలీసులతో చర్చించారు. బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. పోలీసులతో చర్చించారు. ఈ సందర్భంగా, సీఐ బొడ్డేపల్లి సుధాకర్ మాట్లాడుతూ, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, నాయకులు, మరికొంతమంది మాత్రమే ఆహ్వానించి స్టేషన్‌లో చర్చలు జరిపారు. ఎస్ఐ హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుస్టేషన్ వద్ద బాధితులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

బాధితకుటుంబాన్ని పరామర్శించిన డీఈవో

గ్రామస్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న డీఈవో ఎల్. చంద్రకళ, హెచ్‌డిటి సూరిశెట్టి శ్రీనుబాబు బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. బస్సు కిందపడి ప్రాణాలు కోల్పోయిన చిన్నారి వేణుతేజ తల్లిదండ్రులు ఆదిలక్ష్మి, రమణలను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. గ్రామస్థులతో కూడా ఆమె మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం, సీఐ సుధాకర్‌తో చర్చించారు. వీరితో బాటు మండల జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, టీడీపీ నాయకులు గాడు తాతినాయుడు తదితరులున్నారు.